# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 09 జూన్ 2021 | సంపుటి : 02 | సంచిక :322 | పేజీలు : 4 | వెల : రూ 3-00




## సీఎం జగన్‌ను విమర్శించే అర్హత లోకేష్‌కు లేదు: ఎమ్మెల్యే రోజా

విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత లోకేష్‌కు లేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా మండిపడ్డారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, అచ్చెన్నాయుడు చెప్పినట్టు పార్టీ లేదు.. తొక్కా లేదన్నట్లే టీడీపీ ఉందని ఎద్దేవా చేశారు. విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. సీఎం జగన్ పాలనను నీతి అయోగ్ ప్రశంసించిందని ఎమ్మెల్యే రోజా పేర్కొన్నారు.




# ఏపీ సర్కార్ కీలక నిర్ణయం



అమరావతి: ఏపీలో ఐదేళ్లలోపు చిన్నారుల తల్లులకు వ్యాక్సినేషన్‌కు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. చిన్నారులపై థర్డ్‌వేవ్ ప్రభావం ఉంటుందనే అంచనాల నేపథ్యంలో

### ఐదేళ్లలోపు చిన్నారుల తల్లులకు వ్యాక్సినేషన్
### చిన్నారులపై థర్డ్‌వేవ్ ప్రభావం ఉంటుందనే
### అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం

ఏపీ సర్కార్ అప్రమత్తమయ్యింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల వారీగా జాబితా సిద్ధం చేయాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అర్హులైన తల్లులందరికీ ఒకరోజు ముందుగానే టోకెన్లు పంపిణీ చేయాలని పేర్కొంది.టోకన్లలో ఉన్న తేదీ, సమయం ప్రకారం ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కోవిడ్ వ్యాక్సినేషన్ కేంద్రాలకు తరలించి వ్యాక్సిన్ వేయించాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించింది. 5 ఏళ్ల లోపు చిన్నారులతో పాటు ఉన్న తల్లులకి వ్యాక్సిన్ వేయాలని టాస్క్ ఫోర్స్ కమిటీ సూచించింది. అర్హులైన తల్లులు 15 నుంచి 20 లక్షల మంది ఉంటారని అంచనా. కోవిడ్ వచ్చిన చిన్నారులతోపాటు తల్లులను సహాయకులుగా ఆస్పత్రుల్లో ఉంచాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ నివేదిక ఇచ్చింది.

# వ్యాక్సిన్‌పై ప్రజలను చైతన్యపరచండి

### రాజ్యసభ ఎంపీలకు వెంకయ్య సూచన




న్యూఢిల్లీ: కొత్తగా ఎన్నికైన.. మళ్లీ నామినేట్ అయిన రాజ్యసభ ఎంపీలు ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు సమక్షంలో ఇవాళ నలుగురు ఎంపీలు ప్రమాణం చేశారు. కేరళకు చెందిన జర్నలిస్టు జాన్ బ్రిటాస్, సీపీఎం నేత వీ శివదాసన్, సీనియర్ అడ్వకేట్ మహేశ్ జెఠ్మలానీ, బీజేపీ నేత స్వపన్ దాస్‌గుప్తాలు రాజ్యసభ ఎంపీలుగా ప్రమాణం చేశారు. నూతన సభ్యులకు చైర్మన్ వెంకయ్యనాయుడు కంగ్రాట్స్ తెలిపారు. శీతాకాల సమావేశాల సమయంలో తన ఛాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేయాల్సి వచ్చిందని ఆయన అన్నారు. ప్రజలకు మనపై అనేక ఆశలు ఉంటాయని తెలిపారు. ప్రజాజీవితంలో ఉండే మన సభ్యులంతా అత్యున్నత ప్రమాణాలు పాటించాలన్నారు. రీనామినేట్ అయిన సభ్యులకు సభా వ్యవహారాలు తెలుసు అని, కొత్తగా నామినేట్ అయిన వారు రాజ్యసభ పుస్తకాలను, రూల్ బుక్స్, పబ్లికేషన్స్‌ను ఓ సారి చదవాలన్నారు. సీనియర్ సభ్యుల గైడెన్స్ తీసుకోవాలన్నారు. పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుత్వం ఇవ్వడం జరుగుతుందని, స్థానిక నియోజకవర్గ ప్రజలను వ్యాక్సిన్ తీసుకునేలా చైతన్యపరుచాలని ఆయన సభ్యులకు సూచించారు.

# ఎంపీ నవనీత్ కౌర్‌కు భారీ షాక్..

### రూ.2లక్షల జరిమానా
### నకిలీ క్యాస్ట్ సర్టిఫికేట్‌పై పోటీ చేసి
### గెలిచినట్లు ఆరోపణలు
### సర్టిఫికేట్ రద్దుతో పాటు జరిమానా
### విధించిన బాంబే హైకోర్టు



ముంబై: మహారాష్ట్రలోని అమరావతి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన సినీనటి నవనీత్ కౌర్ రాణాకు బాంబే హైకోర్టు షాక్ ఇచ్చింది. ఆమె క్యాస్ట్ సర్టిఫికేట్‌ను రద్దు చేయడంతో పాటు 2 లక్షల రూపాయల జరిమానా విధించింది. నవనీత్ కౌర్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు కాదని, నకిలీ క్యాస్ట్ సర్టిఫికేట్‌తో ఆమె పోటీచేసి గెలుపొందారని ఆరోపిస్తూ మాజీ ఎంపీ, శివసేన నేత ఆనందరావు అదసూల్ దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. విదర్భ ప్రాంతంలోని అమరావతి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నవనీత్ కౌర్.. తొలిసారి ఎంపీగా ఎన్నికైన విషయం తెలిసిందే. బాంబే హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పుతో ఆమె లోక్‌సభ సభ్యత్వం ప్రమాదంలో పడినట్లైంది. శివసేన ఎంపీ అరవింద్ సావంత్ పార్లమెంట్ లాబీల్లో తనపై బెదిరింపులకు పాల్పడ్డారంటూ మార్చిలో నవనీత్ కౌర్ గతంలో సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే జైలుకు పంపుతామని అరవింద్ సావంత్ తనను హెచ్చరించారని తెలిపారు. తనపై యాసిడ్ దాడి చేస్తామంటూ ఫోన్ కాల్స్‌తో పాటు శివసేన లెటర్ హెడ్‌తో లేఖలు కూడా వస్తున్నాయంటూ నవనీత్ కౌర్.. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. 2019 ఎన్నికల్లో మహారాష్ట్రలోని అమరావతి ఎస్సీ రిజర్వ్ లోక్‌సభ స్థానం నుంచి నవనీత్ కౌర్ శివసేన అభ్యర్థి ఆనందరావు అదసూల్ పైనే విజయం సాధించారు. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు రాజకీయ అరంగేట్రం చేసిన నవనీత్‌కౌర్.. ఎన్సీపీ తరఫున ఎన్నికల బరిలోకి దిగి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో అమరావతి లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. నవనీత్ కౌర్ పలు తెలుగు చిత్రాలతో పాటు కన్నడ, తమిళం, మళయాలం, పంజాబీ చిత్రాల్లో కూడా నటించారు.

# ప్రధాని మోదీకి సీఎం వైఎస్ జగన్ లేఖ



అమరావతి: 'పేదలందరికీ ఇళ్లు–పీఎంఏవై' పథకం సుస్థిరాభివృద్ధికి దోహదం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న అందరికీ ఇళ్లు కార్యక్రమంపై మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్ లేఖ రాశారు. 2022 కల్లా 'పేదలందరికీ ఇళ్లు–పీఎంఏవై' పథకం పూర్తి చేయాలన్న ప్రధాని మోదీ సంకల్పం చాలా గొప్పదని సీఎం జగన్ లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు.. "ఏపీ ప్రభుత్వం 68,381 ఎకరాల భూమిని పేదలకు పంచింది. 17,005 గ్రీన్‌ఫీల్డ్ కాలనీల్లో 30.76 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఈ కాలనీల్లో 28.35 లక్షల పక్కాఇళ్లను నిర్మించేందుకు సంకల్పించాం. ఈ ఇళ్ల నిర్మాణం కోసం రూ.50,944 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నాం. పేదలందరికీ ఇళ్లు–పీఎంఏవైలో భాగంగా మౌలిక వసతులు కల్పించాలి. ఇందుకోసం రూ.34,104 కోట్ల నిధులు అవసరమవుతాయి. ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాల కోసం ఇప్పటికే రూ.23,535 కోట్లు ఖర్చు చేశాం. ఇంత మొత్తం వెచ్చించడం రాష్ట్రానికి భారం అవుతుంది. మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రానికి అండగా ఉండాలి' అని సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని కేంద్ర పట్టణ, గ్రామీణాభివృద్ధి శాఖలకు పీఎంఏవై కింద ఏపీకి సమృద్ధిగా నిధులు వచ్చేలా ఆదేశించాలని సీఎం వైఎస్ జగన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరారు.

# లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసిన సీఎం జగన్




అమరావతి: జగనన్న తోడు పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 3.70 లక్షల మంది చిరు వ్యాపారుల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున రూ.370 కోట్లను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. చిరువ్యాపారులకు మేలు చేసే మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. పాదయాత్రలో చిరు వ్యాపారుల కష్టాలు చూశానని, వారి కోసం జగనన్న తోడు ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. చిరు వ్యాపారులకు రూ.10 వేల వరకు వడ్డీ లేని రుణం ఇస్తున్నామని పేర్కొన్నారు. గత ఏడాది జగనన్న తోడు ద్వారా 5.35 లక్షల మంది రుణ సౌకర్యం పొందారని సీఎం వైఎస్ జగన్ గుర్తుచేశారు.రెండో విడతలో 3.7 లక్షల మంది చిరువ్యాపారులకు రూ.370 కోట్ల రుణ సౌకర్యం అందించామని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. మొత్తం 9 లక్షల 5 వేల మంది చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణం ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో చిరు వ్యాపారాలు చేసుకునేవారికి లబ్ధి చేకూరుతుందన్నారు. అర్హత ఉన్నవారందరికీ సాయం చేస్తున్నామని, సకాలంలో వడ్డీ చెల్లించేవారికి తిరిగి వారి ఖాతాల్లోకే జమ చేస్తామని సీఎం జగన్ తెలిపారు.నిరుపేద చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతివృత్తుల వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏటా జగనన్న తోడు పథకం కింద వడ్డీ లేకుండా (సున్నా వడ్డీ) రూ.10 వేలు చొప్పున రుణాన్ని ప్రభుత్వం అందిస్తున్న సంగతి తెలిసిందే.గతేడాది నవంబర్ 25న ఈ పథకానికి శ్రీకారం చుట్టిన సీఎం ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా 5.35 లక్షల మంది లబ్ధిదారులకు సున్నా వడ్డీకే రూ.10 వేల చొప్పున రుణాలను అందించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అందించిన 3.70 లక్షల మందిని కూడా కలిపితే మొత్తం 9.05 లక్షల మంది లబ్ధిదారులకు రూ.905 కోట్లను ఇచ్చారు.

# నోట్లు ముద్రించి ప్రజల ఖాతాల్లోకి నేరుగా వేయండి

### రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియాకి ఆర్థిక వేత్తల సూచనలు
### కరోనా సంక్షోభం నుంచి బయటపడానికి ఇదే మార్గం
### నగదు ముద్రించే ఆలోచనే లేదంటున్న ఆర్‌బీఐ
### రుణ సమీకరణకే ఆర్బీఐ మొగ్గు
### ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.12 లక్షల కోట్ల రుణ సమీకరణ లక్ష్యం





అమరావతి: కోవిడ్?19 తో వచ్చిన ఆర్థిక సంక్షోభం నుంచి ఇండియా త్వరగా కోలుకోవాలంటూ ఇందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరింత నగదును ముద్రించి ప్రజల ఖాతాల్లోకి నేరుగా వేయాలన్న డిమాండ్ రోజు రోజుకూ పెరుగుతోంది. అమెరికా, యూరోప్, జపాన్ వంటి దేశాలు ఈ విధంగానే నగదు ముద్రించి వ్యవస్థలోకి వదిలాయని, అదే విధంగా ఇండియా కూడా చేయాలంటూ మాజీ ఆర్థికమంత్రులు, ఆర్థిక వేత్తలు, పారిశ్రామికవేత్తలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. వీరికి ఇప్పుడు ప్రతిపక్షాలు కూడా గొంతుకలుపుతున్నాయి.కోవిడ్ వచ్చిన తర్వాత అమెరికా ఫెడరల్ బ్యాంక్ తన బ్యాలెన్స్ షీట్‌ను భారీగా పెంచుకుంది. కోవిడ్ ముందు 4.4 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న అమెరికా కేంద్ర ఫెడరల్ బ్యాంక్ బ్యాలెన్స్ షీటు ఇప్పుడు 7.1 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఇదే విధంగా ఆర్‌బీఐ కూడా బ్యాలెన్స్ షీటు పెంచుకోవడం ద్వారా ప్రజల చేతిలో నగదు ఉంచాలన్నదిన ఆర్థికవేత్తల డిమాండ్. మన దేశంలో కూడా నగదు ముద్రించి ప్రజల ఖాతాల్లోకి వేయడం ద్వారా వాళ్లకు కొనుగోళ్ల శక్తి పెరిగి వస్తువులకు డిమాండ్ పెరుగుతుందన్నది వీరి వాదన. ఇదే సమయంలో మరికొంత మంది ఆర్థిక వేత్తలు నగదు ముద్రణను వ్యతిరేకిస్తున్నారు. నగదు ముద్రణ చేస్తే రూపాయి విలువ పతనం కావడంతో పాటు, ద్రవ్యోల్బణం కట్టడి చేయలేని స్థాయికి చేరుకుంటుందన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరు జింబాబ్వే, వెనిజులా దృష్టాంతాలను ఉదాహరణలుగా పేర్కొంటున్నారు. ఇలా ఆర్థికవేత్తలు రెండుగా విడిపోయి ఎవరి వాదనలు వారు గట్టిగా వినిపిస్తున్న తరుణంలో నాలుగు రోజుల క్రితం ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ నగదు ముద్రణపై ఒక స్పష్టత ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో మర్ని కరెన్సీ నోట్లు ముద్రించే అవకాశం లేదంటూ స్పష్టంగా పేర్కొన్నారు. నోట్ల ముద్రణ విషయంలో ఆర్‌బీఐకి సొంత విధానం ఉందని, ఆర్థిక స్థిరత్వం, ద్రవ్యోల్బణం, విదేశీ మారకం రేట్లు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని దానికి అనుగుణంగా నిర్ణయం తీసుంకుంటామన్నారు. ఆర్‌బీఐ నేరుగా నగదు ముద్రణ చేయకుండా పరోక్షంగా వ్యవస్థలోకి నగదు పంపిణీ చేయడానికే మొగ్గు చూపుతోంది. నేరుగా నగదు ముద్రణ చేయడం వల్ల ద్రవ్యోల్బణం పెరిగిపోతుందన్న భయమే దీనికి కారణం.

# 3 కాన్సెప్ట్ సిటీస్‌కి ప్లాన్: మంత్రి గౌతమ్ రెడ్డి

అమరావతి: సీఎం జగన్ దూరదృష్టితో ఎగుమతి వాణిజ్యంలో ఏపీ నాల్గో స్థానంలో ఉందని పరిశ్రమలు, ఐటీ , నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి గౌతమ్ రెడ్డి తెలిపారు. మంత్రిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పరిశ్రమల శాఖ ఉద్యోగులు గౌతమ్‌రెడ్డి, ఏపీఐసీసీ చైర్మన్ రోజాను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గౌతమ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 2019 తర్వాత జీడీపీ, పెట్టుబడులు చాలా దెబ్బతిన్నాయని, అయినా రాష్ట్రంలో 1.58 శాతం గ్రోత్ నమోదు చేశామని, నవరత్నాలు వల్ల మాత్రమే ఈ గ్రోత్ రేట్ పెరిగిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు, మౌలిక సదుపాయాలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడులను అందుబాటులోకి తేవడం ద్వారా పరిశ్రమలకు మరిన్ని అవకాశాలు వస్తాయని మంత్రి గౌతమ్ రెడ్డి తెలిపారు. 2023 డిసెంబర్ లోగా భోగాపురం పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. 3 ఇండస్ట్రియల్ కారిడార్లు 13 జిల్లాలను టచ్ చేస్తున్నాయన్నారు. వైసీపీది ఎంఓయూ ప్రభుత్వం కాదు పని చేసే ప్రభుత్వమని చెప్పారు. ఇండస్ట్రీలు రావడానికి బాక్ ఎండ్ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వ్యాఖ్యానించారు. 3 కాన్సెప్ట్ సిటీస్‌ను సీఎం ప్లాన్ చేశారన్నారు. 2019లో 34,696 కోట్లు పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయని పేర్కొన్నారు. 2020లో 9840 కోట్లు, 2021లో 1039 కోట్లు పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయని చెప్పారు. ఇవన్నీ వైసీపీ అధికారంలోకి వచ్చాకే వచ్చిన ప్రాజెక్ట్‌లని తేల్చిచెప్పారు. 2014 నుంచి 2019 వరకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్స్‌ను ఎంఎస్‌ఎంఈలకు ఇచ్చామన్నారు.

# ఆయన వారి చేతుల్లో కీలుబొమ్మ: మంత్రి సురేష్

ప్రకాశం: కన్నతల్లిలాంటి పార్టీని నడిరోడ్డుపైకి ఈడ్చి తల్లిని హత్యచేసే విధంగా వైసీపీ నర్సాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు ప్రవర్తిస్తున్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్, వైఎస్ జగన్ బొమ్మ పెట్టుకుని వైసీపీ నుంచి గెలిచి పార్టీకి ద్రోహం చేసే విధంగా ఆయన ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. రఘురామ వ్యవహారాలను ఆయన విచక్షణకే వదిలేస్తున్నామన్నారు. పార్టీ పరంగా ఆయన చేసిన ద్రోహం పూర్తిగా ఆక్షేపణీయమన్నారు. రఘురామకృష్ణంరాజు ఇతర పార్టీల నేతల చేతుల్లో కీలుబొమ్మగా మారారని ధ్వజమెత్తారు. అది బీజేపీనా.. టీడీపీనా అన్నది రఘురామనే చెప్పాలన్నారు. రఘురామకృష్ణంరాజును అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు ఎన్నికుట్రలు చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. సరైన సమయంలో తగిన విధంగా ప్రజలే బుద్ధి చెబుతారని మంత్రి సురేష్ అన్నారు.



# సంపాదకీయం

బుధవారం 09 జూన్ 2021

## నేపాల్ రాజకీయాలు కొలిక్కి వచ్చేనా

నేపాల్ లో రాజకీయ ప్రతిష్ఠంభనకు తెరపడింది. పార్లమెంటును రద్దు చేసి గత కొంత కాలంగా కొనసాగుతున్న ప్రతిష్ఠంభనకు అధ్యక్షురాలు ముగింపు పలికారు. ఈ ఏడాది నవంబరులో మధ్యంతర ఎన్నికలకు ఆదేశించడం ద్వారా సంక్షోభాన్ని కొలిక్కి తీసుకువచ్చారు. అధ్యక్షురాలు బిద్యాదేవి భండారీ నిర్ణయం మేరకు నవంబరు 12, 19తేదీల్లో రెండు విడతలుగా మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యూఎంఎల్- యూనిఫైడ్ మార్క్సిస్టు లెనినిస్టు) అధినేత, ప్రధాని ఖడ్గ ప్రసాద శర్మ నాయకత్వంలోని ప్రభుత్వం గత కొంత కాలంగా సభలో మెజార్టీ నిరూపించలేక సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో సర్కారు ఏర్పాటు చేయాల్సిందిగా వివిధ పార్టీలను అధ్యక్షురాలు భండారీ కోరారు. చివరికి వారు కూడా తమ అశక్తతను వ్యక్తం చేయడంతో గత్యంతర లేక, ఆఖరి ప్రత్యామ్నాయంగా పార్లమెంటు రద్దుకు, మధ్యంతర ఎన్నికలకు అధ్యక్షురాలు అనివార్యంగా ఆదేశాలు ఇచ్చారు. 275 మంది సభ్యులు గల నేపాల్ దిగువసభ అయిన ప్రతినిధుల సభలో ఎవరికీ పూర్తి మెజార్టీ లేదు. తాజాగా ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరుతూ ప్రధాని ఓలీ, విపక్షనేత అయిన నేపాలీ కాంగ్రెస్ అధినేత షేర్ బహదూర్ దేవ్ బా అధ్యక్షురాలికి అభ్యర్థనలు అందజేశారు. కొందరు ఎంపీల పేర్లు ఇరువురి అభ్యర్థనల జాబితాల్లో ఉండటంతో పార్లమెంటు రద్దు నిర్ణయం అనివార్యమైంది. రాజకీయ సంక్షోభం తలెత్తిన తరవాత పార్లమెంటును రద్దు చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం. గత డిసెంబరులో తొలిసారి పార్లమెంటును రద్దు చేశారు. అప్పట్లో ఈ నిర్ణయంపై సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ నిర్ణయం చెల్లదని, ఇది రాజ్యాంగ విరుద్ధం అంటూ ఈ ఏడాది ఫిబ్రవరిలో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. దీంతో మళ్లీ ఓలీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే పార్టీలో నెల కొన్న అంతర్గత రాజకీయాల కారణంగా ప్రభుత్వాన్ని నడపలేని పరిస్థితి ఎదురైంది. ఫలితంగా రెండోసారీ పార్లమెంటును రద్దు చేయాల్సి వచ్చింది. 275 మంది సభ్యులు గల నేపాల్ పార్లమెంటుకు 2017 నవంబరు 26, డిసెంబరు 7 తేదీల్లో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం లభించలేదు. ఓలీ నాయకత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యూఎంఎల్) కు 121 సీట్లు వచ్చాయి. పుష్పకమల్ దహాల్ అలియాస్ ప్రచండ నాయకత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు)కు53, నేపాలీ కాంగ్రెస్ కు 63 సీట్లు వచ్చాయి. దీంతో ఓలీ, ప్రచండ పార్టీలు విలీనమయ్యాయి. ఈ సందర్భంగా అధికార పంపిణీకి సంబంధించి ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా చెరి సగం కాలం ప్రధాని పదవిని పంచుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు తొలుత ఓలీకి అవకాశం వచ్చింది. ఒప్పందంలో భాగంగా ప్రధాని పదవిని ప్రచండకు బదిలీ చేయడానికి ఓలీ నిరాకరించారు. దీంతో ప్రచండ ప్రభుత్వానికి తన పార్టీ మద్దతు ఉపసంహరించారు. ఫలితంగా రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. విపక్షమైన నేపాలీ కాంగ్రెస్ అధినేత సూర్య బహదూర్ దేవ్ బా ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నించి చివరకు చేతులెత్తేశారు. దేశంలో అత్యంత పురాతన పార్టీ అయిన నేపాలీ కాంగ్రెస్ భారత అనుకూల పార్టీ. ఈ పార్టీ సుదీర్ఘ కాలం దేశాన్ని ఏలింది. వామపక్ష పార్టీలు సహజంగానే చైనాకు అనుకూలంగా, భారత్ కు వ్యతిరేక గళం వినిపించేవి. నేపాల్ వామపక్ష పార్టీల మధ్యరాజీ కుదిర్చేందుకు చైనా చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. రాజకీయ సంక్షోభం నేపథ్యంలో దేశంలో తాండవిస్తున్న కరోనా గురించి పట్టించుకున్న వారే లేరు. గత నెల 23 నాటికి దేశంలో 5,13,241 కరోనా కేసులు నమోదయ్యాయి. వీరిలో 3,91, 348 మంది కోలుకున్నారు. 6,346 మంది మరణించినట్లు గణాంకాలు ఘోషిస్తున్నాయి. దక్షిణాసియాలో నిరుపేద దేశంగా గుర్తింపు పొందిన నేపాల్ నిత్యం సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటోంది. దీనికితోడు కరోనా ? గోరు చుట్టు మీద రోకలిపోటులా పరిణమించింది. ఈ నేపథ్యంలో మరో ఆరు నెల్లలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలపై అంతటా ఆసక్తి నెలకొంది.

# ఆనందయ్య చుట్టూ రాజకీయాలు

నెల్లూరు, జూన్ 8, (న్యూస్ పల్స్)దేదీ కవితకు అనర్హం అన్నారు మహాకవి శ్రీశ్రీ. కానీ కాదేదీ రాజకీయాలకు అతీతం అని నేతాశ్రీలు అంటారు. కరోనా వేళ కూడా ఖాతరు చేయని రంగం ఒక్కటే ఉంది. అదే రాజకీయ రంగం. ఎక్కడ లాక్ డౌన్ అయినా అక్కడ నోటికి లాక్ లేదు. నాయకుల చురుకు తగ్గడంలేదు. అందుకే ఏదో ఒక దాని మీద పాలిటిక్స్ చేస్తూనే ఉన్నారు. ఇపుడు వారికి ఆనందయ్య కరోనా మందు ఒక సాధనం అయిపోయింది. ఆనందయ్య మందుకు అనుమతులు ఎందుకు ఇవ్వలేదని ఇన్నాళ్ళూ గొడవ పెట్టిన వారు ఇపుడు ఆ మందును అమ్ముకోవడానికి కార్పోరేట్ శక్తులు దిగిపోతున్నాయని రచ్చ చేస్తున్నారు. నెల్లూరు జిల్లా అంటే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి టీడీపీ తరఫున ఫ్రంట్ లైన్ వారియర్ గా ఉంటారు. ఆయనకు పోటీగా ధీటుగా వైసీపీ ఎమ్మెల్యే కాకాని గోవర్ధనరెడ్డి రెడీ అంటారు. ఈ ఇద్దరూ కలసి అనందయ్య మందుకు మద్దతు ఇస్తున్నారు. కానీ ఒకరి మీద మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఆనందయ్య మందును వందల కోట్లకు అమ్ముకోవడానికి ఎమ్మెల్యే కాకాని మాస్టర్ ప్లాన్ వేశారు అంటూ సోమిరెడ్డి చెసిన కామెంట్స్ ఏపీలో కాక రేపాయి. ఇపుడు దాని మీద సోమిరెడ్డి పై పోలీసులు కేసులు పెట్టారు. ఇదంతా అవాస్తవమని ఆనందయ్య స్వయంగా చెబుతున్నా రాజకీయ రచ్చ ఆగడంలేదు. ఇక ఈ సమయంలో ఆనందయ్య గురించి కూడా చెప్పుకోవాలి. ఆయన ఆల్ పార్టీలకు లీడర్ అని తెలుస్తోంది. ఆయనకు రాజకీయ వాసనలు చాలానే ఉన్నాయి. ఒక మీడియా ఇంటర్వ్యూలో ఆనందయ్య స్వయంగా చెప్పుకున్నారు. తాను టీడీపీలో సోమిరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉండేవాడినని కూడా తెలియచేశారు. ఆ తరువాత కాంగ్రెస్ లో ఉన్నానని, బీజేపీలో కూడా తనకు మిత్రులు ఉన్నారని, ఇక వైసీపీలో ప్రస్తుతం ఉన్నానని అంటున్నారు. మొత్తానికి చూస్తే ఆనందయ్యకు అందరూ మిత్రులే. ఆయన అందరి బంధువే. పైగా ఆయన కూడా ఈ రాజకీయాలు తనకు అలవాటే కానీ ప్రస్తుతానికి వాటికి ఫుల్ స్టాప్ పెట్టి కరోనా మందు పంపిణీ మీదనే అందరూ దృష్టి ఉంచాలని ఆయన కోరుతున్నారు. ఇదిలా ఉంటే రాజకీయాల్లో ఉంటూ పంచాయతీ పదవుల వరకే పరిమితమైన

ఆనందయ్య కుటుంబం ఈసారి పెద్ద పదవులు కోరుకుంటుందా అన్న చర్చ అయితే ఉంది. ఆనందయ్యకు ఈ రోజు తిరుగులేని పాపులారిటీ వచ్చేసింది. పైగా ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వేళ మందు అంటూ ఒకటి ఉందని లోకానికి చాటి చెప్పిన ఆనందయ్య దేవుడిలాగానే కనిపిస్తున్నారు. దాంతో ఆయన్ని ఎవరూ వదిలేది లేదని కూడా అంటున్నారు. నెల్లూరు రాజకీయాల్లో ఆనందయ్యకు అటు టీడీపీ ఇటు వైసీపీ కూడా గట్టి మద్దతుగా ఉన్నాయి. మరో మూడేళ్ళలో ఎన్నికలు ఉన్నాయి. ఆయన పాపులారిటీని వాడుకోవడానికి రాజకీయ పార్టీలు సిద్ధపడడం అన్నది కామన్. ఇక రాజకీయాలో ప్రవేశం ఉన్న ఆనందయ్య కుటుంబం కూడా చాన్స్ వస్తే వదిలేసుకుంటుందా అన్నదే చర్చ. ఇక ఆయన కూడా బలమైన బీసీ వర్గానికి చెందిన వారు. దాంతో ఆనందయ్య రాజకీయ కామందయ్యగా మారే రోజు దగ్గరలో ఉందా అన్నదే విశ్లేషణ.

# ఏపీ అంతా ఆదానీమయం




నెల్లూరు, జూన్ 8, (న్యూస్ పల్స్)గంగవరం పోర్టు విశాఖలో ప్రైవేట్ రంగంలో ఏర్పాటు అయింది. నాడు సీఎం గా రాజశేఖర్ రెడ్డి ఉన్నారు. విశాఖ లో నంబర్ వన్ పోర్టుగా ప్రభుత్వ రంగంలో ఒకటి ఉండగా ప్రైవేట్ లో మళ్ళీ ఎందుకు అన్న ప్రశ్న వచ్చింది. అయితే ఈ పోర్టు స్టీల్ ప్లాంట్ అవసరాలు ఎక్కువగా తీరుస్తుంది అన్న కాన్సెప్ట్ తో ఏర్పాటు చేశారు. పైగా స్టీల్ ప్లాంట్ మిగులు భూముల నుంచి రెండు వేల ఎకరాలను కూడా తీసుకుని మరీ కేటాయించారు. గంగవరం పోర్టుని డిజైన్ చేసింది డీవీఎస్ రాజు కన్సార్టియం. గంగవరం పోర్టు లో మేజర్ షేర్ వారిదే. అంటే 58 శాతం పైగా వారికే వాటాలు ఉన్నాయి. ఇక మరో 31 శాతం తో విండీ లేక్ సైడ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ఉంది. ఇక దేశంలో ఇపుడు నయా కార్పొరేట్ శిఖరంగా ఆదానీ పేరు వినిపిస్తోంది. పోర్టు రంగంలో ఆదానీ ఏకస్వామ్యమే కొనసాగుతోంది. అందులో భాగంగా ఏపీలో చాలా పోర్టులు వారి ఖాతాలోకే వెళ్తున్నాయి. ఇక విశాఖలో గంగవరం పోర్టుని కూడా ఆదానీ సంస్థ కొనేసింది. నూటికి తొంబై శాతం వాటాలు ఉన్న డీవీఎస్ రాజు కన్సార్టియం తో పాటు విండీ లేక్ సైడ్ ఇన్వెస్ట్మెంట్ లిమిటెడ్ నుంచి కూడా భారీ మొత్తాలను ఇచ్చి మరీ టోటల్ వాటాలను తీసుకుని గంగవరాన్ని తన పరం చేసుకుంది. ఇక మిగిలింది రాష్ట్ర ప్రభుత్వ వాటా పది శాతం. దాన్ని కూడా విక్రయించడానికి ఏపీ ప్రభుత్వం రెడీగా ఉందని తెలుస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కార్యదర్శులతో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నిర్ణయం లాంచనమే. అతి త్వరలోనే ఏపీ సర్కార్ వాటాలు కూడా ఆదానికే దక్కబోతున్నాయి. అంటే నూటికి నూరు శాతం గంగవరం పోర్టు తొందరలోనే ఆదానీ గ్రూప్ పరం కాబోతోంది అన్న మాట. ఆ దిశగా ఆదానీ ప్రయత్నాలు ఫలించే అవకాశాలు ఉన్నాయి. పోర్ట్ రంగంలో పాన్ ఇండియా లెవెల్ లోనే ఆదాని దిగ్గజం కాబోతోంది అన్నమాట. ఇక విశాఖలో చూసుకుంటే ఏడాదికి 6.7 కోట్ల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో కార్గో పోర్టుగా గంగవరం నిలుస్తోంది. అంటే వ్యూహాత్మకైన ప్రదేశంలోనే ఆదానీ జెండా పాతేసింది అని అర్ధమవుతోంది అంటున్నారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్ నాడే గంగవరం పోర్టుకు అభ్యంతరం వ్యక్తం చేసింది. కానీ ఏవో విస్తృత ప్రయోజనాలు పేరు చెప్పి కథ నడిపించారు. ఇపుడు ఆదానికీ మొత్తం దాసోహం అంటున్నారు. ఆదాని బిగ్ షాట్. దాంతో ఇప్పటికే గంగవరం పోర్టుతో ఇబ్బందులు పడుతున్న విశాఖ పోర్టుకు అసలైన సవాల్ ఎదురుకాబోతోంది అంటున్నారు. రానున్న రోజుల్లో ఆదానీ దూకుడు మామూలుగా ఉండదని, గంగవరం పోర్టు ఆపరేషన్ తో విశాఖ పోర్టు కుదేల్ అయినా ఆశ్చర్యం లేదు అన్న మాట ఉంది. ఈ లోగా కాగల కార్యం తీర్చినట్లుగా స్టీల్ ప్లాంట్ ని కేంద్రం ప్రైవేట్ పరం చేసి ఆదానికే అప్పగిస్తే ఇక తిరుగులేని విజేత అవుతుంది అని కూడా అంటున్నారు. మొత్తానికి సర్వం ఆదానికే సమర్పయామి అంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చూపిస్తున్న స్పీడ్ తో విశాఖలో ప్రభుత్వ రంగం ఢమాల్ అవడం ఖాయంగా కనిపిస్తోంది.

# జగన్ హస్తిన టూర్ వెనుక...



న్యూఢిల్లీ, జూన్ 8, (న్యూస్ పల్స్)జగన్ రెండేళ్ళ మౌనాన్ని వీడబోతున్నారా. తనను తానే గట్టిగా నమ్ముకుంటున్నారా అంటే సమాధానం అవును అనే వస్తోంది. జగన్ కష్టపడి అధికారం సంపాదించారు. అలాగే అనేక మందికి ముఖ్య బాధ్యతలు కూడా ఇచ్చారు. మరి కీలకమైన స్థానాలలో ఉన్న వారు జగన్ కి మేలు చేస్తున్నారా. ఆయన కోరుకున్న విధంగా పని చేస్తున్నారా అంటే సమాధానం నిరాశాపూరితంగానే వస్తుంది. ముఖ్యంగా ఢిల్లీ లాబీయింగ్ విషయంలో వైసీపీ పూర్తిగా ఫెయిల్ అయింది అని చెప్పవచ్చు. ఒక్క రెబెల్ ఎంపీ మొత్తం ఢిల్లీ రాజకీయాన్ని అనుకూలం చేసుకుంటూంటే వైసీపీ మాత్రం ఇంత పెద్ద పార్టీ అయి ఉండి చేష్టలుడిగి చూస్తోంది అనే చెప్పాలి. ఇక ఢిల్లీలో జగన్ నమ్మిన బంటు విజయసాయిరెడ్డి మొత్తం వైసీపీ పార్లమెంటరీ వ్యవహారాలు చూస్తున్నారు. ఆయన విపక్షంలో ఉండగా అనేక విజయాలు సాధించారు. జగన్ కోరుకున్నపుడల్లా అపాయింట్మెంట్ నేరుగా ప్రధానితో ఇప్పించిన ఘనత కూడా ఆయన సొంతమని అంతా అనేవారు. అలాటి ఆయన అధికారంలోకి వచ్చాక మాత్రం బాగా డల్ అయ్యారు. ఆయన చక్రం విశాఖలో తిరుగుతోంది కానీ ఢిల్లీలో మాత్రం ఏమీ కాకుండానే ఉంది. లేకపోతే 27 మంది ఎంపీలు వైసీపీకి ఉంటే ఒకే ఒక ఎంపీ రఘురామ క్రిష్ణం రాజు మాట కేంద్ర ప్రభుత్వం వద్ద చెల్లడం అంటే నిజంగా వైసీపీ లాబీయింగ్ ఫెయిల్యూర్ అనుకోవాలేమో. మరో వైపు చూస్తే బీజేపీ ఇపుడు మోడీ అమిత్ షా నాయకత్వంలో నడుస్తోంది. వారిద్దరి రాజకీయ వ్యూహాలు ఎవరికీ అంత తొందరగా అర్థం కావు. ఇక జనాలనే నమ్ముకునే జగన్ లాంటి యువ నేతలకు వ్యూహాలతో పెద్దగా పని లేదని అంతా అనుకుంటారు. కానీ వ్యూహాలు కూడా ఎప్పటికపుడు అవసరమే. వాటిని పదును పెట్టాల్సిందే అని తాజా రాజకీయ పరిణామాలు రుజువు చేస్తున్నాయి. అందుకే జగన్ ఇపుడు బీజేపీని బాగా అర్ధం చేసుకోవాలనుకుంటున్నారు. ఆ పార్టీ తనకు దగ్గరా? దూరమా? అన్నది కూడా తేల్చుకోవాలనుకుంటున్నారు. ఇక మీదట జగన్ ఢిల్లీలో లాబీయింగ్ విషయంలో ఎవరినీ పట్టించుకోరని, ఎవరికీ బాధ్యతలు అప్పగించారని అంటున్నారు. తానే నేరుగా కేంద్ర పెద్దలతో వ్యవహారాలు సరిచూసుకోవాలని ఆయన భావిస్తున్నారుట. తాను బాధ్యతలు అప్పగించిన వారు అనుకున్న ఫలితాలు తేలేకపోతున్నారు. అదే సమయంలో వైసీపీ నిండా మునిగేలా పరిణామాలు వేగంగా సాగుతున్నా కూడా కీలక నేతలు నిస్తేజంగా చూస్తున్నారు. దాంతో జగన్ ఇక మీదట కేంద్రం తో డైరెక్ట్ కాంట్రాక్ట్ తో ఉండడమే కాదు బీజేపీకి తన అవసరం ఉందా లేదా అన్నది కూడా తెలుసుకోవాలనుకుంటున్నారుట. ఒక వేళ కాషాయం వేరే వ్యూహాలతో ఉంటే కనుక జాతీయ రాజకీయాల్లో జగన్ కొత్త మార్గాలను కూడా ఎన్నుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. మొత్తానికి ఇటు తాడేపల్లినే కాదు అటు ఢిల్లీని కూడా బ్యాలన్స్ చేసుకోవడానికి జగనే దూకుడుగా కదులుతున్నారుట.

## గ్యాస్ సిలిండర్ పేలి ఒకరి దుర్మరణం

చిత్తూరు చిత్తూరు జిల్లా మదనపల్లె పట్టణం తిరుపతి రోడ్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో మంగళవారం గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ దారుణ ఘటనలో టెక్నీషియన్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా కార్మికుడు నయాజ్ కాలు, చేయి పూర్తిగా కోల్పోగా, శివమహేష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయుర్వేద మూలికలతో తయారుచేసిన పెర్- ఫ్యూమ్ సుగంధాలు తయారుచేసిన వాటి నాణ్యత ప్రమాణాలు పరిశీలించే క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ ను స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ లోని కంటైనర్ లో ఏర్పాటు చేశారు. వాటిని అమర్చే క్రమంలో ఓ గ్యాస్ పేలిపోయి సిలిండర్ పగిలిపోయింది. ఈ ప్రమాదం టెక్నీషియన్ లింగన్న అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ రవి మనోహరచారి, సీఐ నరసింహులు ప్రమాదం జరగడానికి కారణాలు ఆరా తీస్తున్నారు. గాయపడిన వారిని స్థానికంగా ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# 20 మందిపై టీడీపీ ఆరా

విజయవాడ, జూన్ 8, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు అధికారం కోల్పోయాక అసలు విషయం తెలిసి వచ్చింది. ఎవరు తన వాళ్లో, ఎవరు కాదో ఆయనకు తెలిసి వచ్చింది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కేవలం కొద్ది మంది మాత్రమే యాక్టివ్ గా ఉన్నారు. వారిలో కూడా ఎక్కువగా గతంలో ఏ పదవులు పొందని వారే కావడం విశేషం. అధికారంలో ఉన్నప్పుడు పదవులు దక్కించుకున్న వారు మౌనంగా ఉంటే, ఏ పదవులు దక్కని వారు ఇప్పుడు పార్టీని ఆదుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించిన దేవినేని ఉమ, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, అచ్చెన్నాయుడు, జవహర్ వంటి వారే యాక్టివ్ గా ఉన్నారు. చంద్రబాబు కేబినెట్ లో పనిచేసిన దాదాపు ఇరవై మంది మంత్రులు యాక్టివ్ గా లేరు. దీనికి వారి వ్యక్తిగత కారణాలు వారికి ఉన్నాయని చెబుతున్నా, ఆయా నియోజవకర్గాల్లోనే కాకుండా ఆ ప్రభావం రాష్ట్ర పార్టీపై చూపుతుందని చెబుతున్నారు. ఇక గతంలో ఏ పనులు అనుభవించని వారు ఇప్పుడు యాక్టిగ్ గా ఉండటాన్ని చంద్రబాబు గమనిస్తున్నారు. పంచుమర్తి అనూరాధ, పట్టాభి, వర్ల రామయ్య వంటి వారు యాక్టివ్ గా ఉంటున్నారు. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేయడంలో వీరు ముందుంటున్నారు. చంద్రబాబు కు అండగా నిలుస్తున్నారు. పార్టీ కష్టకాలంలో అండగా ఉంటూ యాక్టివ్ గా ఉన్న వారి జాబితాను చంద్రబాబు రూపొందిస్తున్నారట. ఈసారి అధికారంలోకి వస్తే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారని చెబుతున్నారు. పార్టీలో యాక్టివ్ గా ఉండే నేతలతోనే చంద్రబాబు నేరుగా టచ్ లోకి వస్తున్నారని, వారు చేసే విమర్శలను ఆయన ప్రశంసిస్తున్నారని చెబుతున్నారు. ఎలాంటి కేసుల నమోదయినా పార్టీ అండగా ఉంటుందని చంద్రబాబు వారికి భరోసా ఇస్తున్నారు. మొత్తం మీద చంద్రబాబు తనకు అండగా ఉంటున్న వారి పట్ల సానుకూలతతో ఉన్నట్లు తెలసింది. వీరిలో కొందరికి ఆర్థిక సాయం కూడా చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## రెండు వర్గాల మధ్య బేధాలు

కర్నూలు, జూన్ 8, (న్యూస్ పల్స్)వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక నియోజకవర్గాల్లో ఆధిపత్య పోరు జరుగుతుంది. రెండువర్గాలుగా విడిపోయి పార్టీకి నేతలు నష్టం తెస్తున్నారు. అందులో అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం ఒకటి. ఉరవకొండ నియోజకవర్గంలో వైసీ?పీలో రెండు గ్రూపుల మధ్య పోరు తారాస్థాయికి చేరిందంటున్నారు. అధిష్టానం అనేక సార్లు నచ్చచెప్పినా ఫలితం లేకుండా పోయింది. ఎప్పటికప్పుడు కొత్త సమస్యలతో గ్రూపు విభేదాలు ఉరవకొండ వైసీపీలో భగ్గుమంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ హవాతో వైసీపీ అనేక జిల్లాల్లో క్లీన్ స్వీప్ చేసింది. ముఖ్యంగా రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాల్లో వైసీపీ అన్ని నియోజకవర్గాల్లో విజయం సాధించింది. కానీ అనంతపురం జిల్లాలో ఉరవకొండ, హిందూపురం నియోజకవర్గాల్లో మాత్రం టీడీపీ గెలిచింది. ఉరవకొండలో విశ్వేశ్వర్ రెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే ఆయనను వైసీపీ ఇన్ చార్జిగా నియమంచింది. ఉరవకొండలో టీడీపీ విజయం సాధించినా విశ్వేశ్వర్ రెడ్డి, ఆయన కుమారుడు ప్రణయ్ రెడ్డి చెప్పినట్లు అధికారులు నడుచుకోవాల్సిందే. వాలంటీర్ల నియమాకం నుంచి లబ్దిదారుల ఎంపిక వరకూ వీరు చెప్పినట్లే జరగాలి. వైసీపీలో ఉన్న మరోనేత, మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కూడా ఆధిపత్యం కోసం రెండేళ్లుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. నేరుగా అధిష్టానాన్ని కలసి తాను అనుకున్న పనులను సాధించుకుంటున్నారు. ఇటీవల కాలంలో మళ్లీ రెండువర్గాల మధ్య విభేదాలు తీవ్రమయ్యాయంటున్నారు. విశ్వేశ్వర్ రెడ్డి కుమారుడు ప్రణయ్ రెడ్డి ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొనడం, పార్టీ కార్యక్రమాలకు శివరామిరెడ్డ వర్గానికి ఆహ్వానం లేకపోతుండటతో రెండు వర్గాలు బాహాబాహీకి దిగుతున్నాయి. దీంతో మరోసారి అధినాయకత్వం రెండు వర్గాలను తాడేపల్లికి రమ్మని చెప్పిందన్న వార్తలు వస్తున్నాయి. టీడీపీని బలహీన పర్చాల్సిన వైసీపీ నేతలు తమలో తాము ఘర్షణలకు దిగుతూ పార్టీని మరింత బలహీనం చేస్తున్నాయి.

## టీడీపీలో మళ్లీ ఎన్టీఆర్ డిమాండ్

కడప, జూన్ 8, (న్యూస్ పల్స్)ప్పుడు ఏపీలో టీడీపీ పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలిసిందే. ఏ ఎన్నికలు జరిగినా వరుసగా ఓటమి పాలవుతోంది. దీంతో టీడీపీ నాయకత్వంపై కార్యకర్తల్లో సంక్షోభం నెలకొంది. దీంతో అందరూ ఎన్టీఆర్ ను తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఆయనైతేనే పార్టీని నడిపించగలరని ప్రతి సభలోనూ నినాదాలు చేస్తూనే ఉన్నారు. తాజాగా కూడా అదే ఘటన మరోసారి తెరమీదకు వచ్చింది. ఇక ఎంతమంది ఎన్ని రకాలుగా డిమాండ్ చేసినా.. ఎన్టీఆర్ మాత్రం తన పూర్తి సమయాన్ని సినిమాలకే కేటాయిస్తున్నారు. అంతే గానీ ఎక్కడా రాజకీయాల ప్రస్తావన తీసుకురావట్లేదు. కానీ నందమూరి, టీడీపీ అభిమానులు మాత్ర ఎన్టీఆర్ జపం వదలట్లేదు. ఇప్పుడు మరోసారి టీడీపీ అధినేత చంద్రబాబు నియోజకవర్గంలోనే ఎన్టీఆర్ డిమాండ్‌ను తెరమీదకు తెచ్చారు. కుప్పంలో ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావాలంటూ లో జెండాను ఆవిష్కరించారు టీడీపీ కార్యకర్తలు. 40 అడుగుల ఎత్తులో తాజాగా జెండా ఏర్పాటు చేసిన అభిమానులు.. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలి పంచాయతీ ఎన్నికల ఫలితాలు సమయంలో కూడా కుప్పంలో ఎన్టీఆర్ అభిమానులు ఇలానే కాకరేపారు. పార్టీ అధినేత ఇలాకా కుప్పంలో పార్టీకి వ్యతిరేక పవనాలు వీయడంతో స్థానిక నాయకులతో పాటు కార్యకర్తలు నిరాశలో మునిగిపోయారు. ొందరైతే రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో “రావాలి జూనియర్? కావాలి ఎన్టీఆర్” అంటూ నినదించారు తెలుగు తమ్ముళ్లు. డిమాండ్ రాష్టవ్యాప్తంగా ఎంతోకాలంగా ఉన్నప్పటికీ నాలుగడుగులు ముందుకేసి జూనియర్ ఎన్టీఆర్‌ను కుప్పం తీసుకురావాలని ఏకంగా టీడీపీ అధినేత చంద్రబాబుకే సరాసరి విజ్ఞప్తి చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అధినేత టూర్‌లో జూనియర్ ఎన్టీఆర్ నినాదాలు చేసి తెలుగుదేశం పార్టీలోనే కొత్త చర్చకు తెరతీశారు. ఇప్పుడు మళ్లీ జై జై.. జూనియర్ ఎన్టీఆర్ అంటూ నినదిస్తున్నారు. నియోజకవర్గంలోని కుప్పం మండలం మంకల దొడ్డి పంచాయతీ మలకల పల్లిలో ఎన్టీఆర్ డిమాండ్ కు నిదర్శనంగా ఈ జెండాను ఆవిష్కరించారు అభిమానులు.

## తప్పిన కొద్ది. ఎక్సైజ్ శాఖలో ఇంటిదొంగల గుట్టు

విశాఖపట్టణం, జూన్ 8, (న్యూస్ పల్స్) విశాఖ ఎక్సైజ్ స్కామ్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో నగదు దుర్వినియోగంపై విచారణ జరిపి హెడ్ కానిస్టేబుల్ కొండయ్య సహా మరో ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. అలాగే ఎస్ఐ విమలాదేవిపై చర్యలకు ఎక్సైజ్ కమిషనర్ కు సిఫార్సు చేశారు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు. ఈ స్కామ్ లో ఇప్పటికే ఎక్సైజ్ సీఐ నాగ శ్రీనివాసరావుపై వేటు వేశారు అధికారులు.మద్దిపాలెం స్పెన్సర్ లో, గోపాల్ పట్నంలోని లక్ష్మీనగర్, మల్కాపురం మద్యం షాపుల్లో అక్రమాలు జరిగినట్టు అధికారులు గుర్తించారు. మొత్తం 33లక్షల రూపాయల నగదు పక్కదారి పట్టగా, అందులో 8.5లక్షలు మాత్రమే అధికారులు రికవరీ చేశారు.ప్రభుత్వ మద్యం షాపుల్లో నగదు అవకతవకలపై లోతైన విచారణ జరుపుతున్నారు. విశాఖ సర్కిల్-4 పరిధిలో నాలుగు షాపుల్లో నగదు పక్కదారి పట్టినట్టు నిర్ధారణ అయింది. మొత్తం 33లక్షల రూపాయలు నొక్కేశారు సిబ్బంది.ఇందులో బాధ్యులైన సీఐ శ్రీనివాసరావుని విధుల నుంచి తప్పించారు ఉన్నతాధికారులు. ఇద్దరు కానిస్టేబుళ్లపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. జిల్లాలో స్పెషల్ డ్రైవ్ కు ఆదేశించిన అధికారులు.. సూపర్ వైజర్లు, వైన్ షాప్ సిబ్బందిని విచారిస్తున్నారు. ఇంకా 12మంది సిబ్బందికి నోటీసులు ఇచ్చాము. నిధులు రికవరీ తర్వాత క్రిమినల్ కేసులు పెడతామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు చెప్పారు.

## రాత్రికి రాత్రే రోడ్డు నిర్మాణం

విశాఖపట్టణం, జూన్ 8, (న్యూస్ పల్స్)అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడంతో.. ఆ ఊరి వాసులు ఓ నిర్ణయానికి వచ్చారు. అనుకున్నదే తడవుగా చందాలు వేసుకున్నారు. అంతేనా శ్రమదానం కూడా చేస్తున్నారు. ఇది కాస్తా చర్చనీయాంశమయ్యేసరికి తమ డిమాండ్ను మరింత గట్టిగా వినిపిస్తున్నారు.విశాఖ ఏజెన్సీ వాసులు? రోడ్డు కోసం నడుం బిగించారు. పాడేరు నియోజకవర్గంలోని హుకుంపేట మండలం తీగలవలస పంచాయితీ పరిధిలోని గుర్రాల తోట గ్రామం ఇది. 300 మంది గిరిజనులు నివసముండే చిన్న గ్రామం గుర్రాల తోట. ఈ గ్రామం మిగతా గ్రామాలకు మూడు కిలోమీటర్ల ఎత్తులో ఉంటుంది. గర్భిణీలు, వృద్ధులు, రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే డోలీలో మోయాల్సిందే. సరుకులు కొనుక్కోవాలంటే కాలినడకన కొండ దిగాలి. ఇక్కడకు అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వెళ్తుంటారు.కానీ వీరి గోడును పట్టించుకున్నది లేదు. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు వేయకపోవడంతో స్థానికులంతా నడుం బిగించారు. పార, పలుగు తీసుకుని శ్రమదానం చేస్తున్నారు. ఒక్కో కుటుంబం అయిదు వేల రూపాయలు జమచేసి ఆ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. బండరాళ్లను తొలగించేందుకు ప్రొక్లెయిన్లను అద్దెకు తీసుకొచ్చారు. సుమారు నాలుగు లక్షల రూపాయల వ్యయంతో మూడు కిలోమీటర్ల రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికైనా రాజకీయ నేతలు, అధికారులు స్పందించి తమ గ్రామానికి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.వర్షాకాలం వచ్చేస్తోంది. దీంతో.. యుద్ధప్రాతిపదికన బండరాళ్లు తొలగించి రోడ్డు నిర్మాణానికి అనువుగా చదును చేస్తున్నారు గుర్రాల తోట వాసులు. పెదబయలు మండలానికి చెందిన ఉర్రాడ, జామిగూడా గ్రామాలు గుర్రాల తోటకు ఆనుకుని ఉంటాయి. కానీ ఆ గ్రామాలకు వెళ్లాలన్న రోడ్డు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు స్థానికులు. రెండు, మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పనులు చాలావరకు పూర్తికావొచ్చాయి. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు?తమకు రోడ్డు మంజూరు చేసి, ఇంతవరకు చేసిన పనిని ఉపాధి హామీ పనులుగా గుర్తించాలని కోరుతున్నారు గిరిపుత్రులు. చూడాలి మరి దీనిపై అధికారయంత్రాంగం ఎలా స్పందిస్తుందో!.

## ఎమ్మెల్సీల కోసం వెయిటింగ్

గుంటూరు, జూన్ 8, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో ఎమ్మెల్సీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎమ్మెల్యే కోటాలో మూడు స్థానాలు భర్తీ కావాల్సి ఉంది. ఈ మూడు కూడా వైసీపీ ఖాతాలోనే పడతాయి. శాసనసభలో సభ్యుల సంఖ్యాబలంతో ఈ మూడు స్థానాలను వైసీపీ చేజిక్కించుకుంటుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. మే 31వతేదీ నాటికి ఈ ఎన్నిక జరగాల్సి ఉన్నా కరోనా పరిస్థితుల కారణంగా కేంద్ర ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. జూన్ నెలలో కొంత కరోనా తగ్గుముఖం పట్టిన తర్వాత ఎన్నికలను నిర్వహించే అవకాశముంది.అయితే ఈ మూడు స్థానాల్లో ఎమ్మెల్సీలుగా జగన్ ఎవరిని ఎంపిక చేస్తారన్న చర్చ పార్టీలో జోరుగా సాగుతుంది. జగన్ తన పాదయాత్ర సమీపంలో అనేక మందికి ఎమ్మెల్సీ పదవులను హామీ ఇచ్చారు. ఇప్పటివరకూ భర్తీ చేసిన ఎమ్మెల్సీ స్థానాల్లో సామాజిక సమీకరణాల ఆధారంగా జగన్ అవకాశం కల్పించారు. కానీ పార్టీకి కష్టపడి పనిచేసిన వారిని కాకుండా మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ అంటూ జగన్ వేసిన లెక్కలు పార్టీలోనే విమర్శలకు దారితీశాయి.దీంతో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చిన వారికే పదవులు కేటాయిస్తారన్న టాక్ విన్పిస్తుంది. ప్రధానంగా మర్రి రాజశేఖర్ ఎప్పటి నుంచో ఎమ్మెల్సీ పదవి కోసం నిరీక్షిస్తున్నారు. ఈయన పట్ల జగన్ కూడా సానుకూలంగా ఉన్నారు. కమ్మ సామాజికవర్గానికి ఇప్పటి వరకూ ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడంతో ఈసారి జగన్ మర్రి రాజశేఖర్ కు ఖచ్చితంగా కేటాయిస్తారన్న టాక్ పార్టీలో వినపడుతుంది. జగన్ కూడా అదే రకమైన సంకేతాలు పంపారంటున్నారు.దీంతో పాటు మరికొందరు సీనియర్ నేతలు కూడా ఎమ్మెల్సీ పదవులకోసం చూస్తున్నారు. దీంతోపాటు జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే రామసుబ్బారెడ్డికి కూడా స్థానం దక్కే అవకాశముందన్న టాక్ విన్పిస్తుంది. ఇటీవలే ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని జగన్ హామీఇచ్చారు. ఇక ఉత్తరాంధ్ర నుంచి దాడి వీరభద్రరావు పేరు విన్పిస్తుంది. ఇలా కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ముగ్గురు పేర్లను ఎంపికను జగన్ పూర్తి చేశారంటున్నారు.

## కరోనా మృతుల కుటుంబాలకు పరిహారం

పాడేరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రవేశపెట్టిన కరోనా వ్యాధి తో చనిపోయిన తల్లిదండ్రుల వారి సంతానానికి అనాధలైన పిల్లలకు 10 లక్షల పరిహారం పథకం క్రింద బాధితులకు బాండ్లను అందచేశారు. మండలం లోని సప్పిపుట్గ్రామం, వంతాడపల్లి గ్రామ పంచాయతీ చెందిన పాంగి కాసులి (తల్లి) ,పాంగి మంజు (తండ్రి)ఇటీవల కరోనా వ్యాధితో మరణించగా అనాధలైన వారి ఇద్దరి పిల్లలకు ఒక్కొక్కరికీ మంగళవారం 10 లక్షల చొప్పున బాండులను ఆర్డీఓ కార్యాలయం లో స్థానిక శాసన సభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ,రెవెన్యూ డివిజనల్ అధికారిణి కె.లక్ష్మి శివ జ్యోతి చేతులమీదుగా వారికి అందజేశారు.

# ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**కనీస వేతనం 21000 ఇవ్వాలి..**
**ఏఐటీయూసీ డిమాండ్.**

కడప జూన్ 8 కడప నగరంలోని ఏ ఐ టి యు సి జిల్లా కార్యాలయం వద్ద అ కడప జిల్లా సమితి పిలుపు మేరకు.. రాష్ట్రంలో 15 సంవత్సరాలుగా గర్భవతులకు బాలింతలకు నవజాత శిశువులకు సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు ఏలాంటి ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ ,పీఎఫ్ సౌకర్యాలు లేకుండా ఉన్నారని వారికి తక్షణ ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, యల్ నాగ సుబ్బారెడ్డి ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుభాషిని, అయ్యవారమ్మలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఈరోజు కడప నగరంలోని స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం వద్ద ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధం కడప జిల్లా సమితి పిలుపు మేరకు కడప నగరంలో ఉన్న ఆశా కార్యకర్తలు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు 365 రోజులు 24 గంటల పాటు ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తిస్తూ గర్భవతులకు వైద్య సదుపాయాలు అందిస్తూ బాలింతలను నవజాత శిశువుల ను సంరక్షిస్తూ పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత ఈఎస్ఐ పీఎఫ్ ఎలాంటి సౌకర్యాలు లేకుండా పని చేస్తున్నారని వారికి తక్షణ ఉద్యోగ భద్రత కల్పించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 16 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్యకర్తలను 60 సంవత్సరములు వయోపరిమితి తీరిందని వారిని రిటైర్మెంట్ పేరుతో బలవంతపు రిటైర్మెంట్ చేస్తున్నారని వారికి రిటైర్మెంట్ బెనిఫిట్ ఇచ్చి రిటైర్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల సచివాలయాలకు బదలాయించాలని రాష్ట్ర ప్రభుత్వ యోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి గత ఏడాది మార్చి నెల నుండి కరోనా బాధితులను గుర్తిస్తూ వారికి ఆశాలు ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండ సేవలు అందిస్తున్నారని దానివలన ఆశా కార్యకర్తలకు అనేకమందికి కరోనా పాజిటివ్ వచ్చిసరైన వైద్యం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆశలతో కరోనా లో పని చేయించుకోవడం తప్ప ఆశల ప్రాణాలకు భద్రత కల్పించే ఆలోచన చేయలేదని ప్రభుత్వం వెంటనే ఆశా కార్యకర్తలకు కరోనా రక్షణ పరికరాలు శానిటైజర్, మాస్కులు, గౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరోనా బారినపడి మరణించిన ఆశా కార్యకర్తలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ యోజన పథకం ఇన్సూరెన్స్ కింద 50 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని చనిపోయిన ఆశా కుటుంబంలోని ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తలు చేస్తున్న విధులకు సంబంధించి నమోదు చేస్తున్న రికార్డ్ పుస్తకములను ఇంతవరకూ ప్రభుత్వం ఏ సంవత్సరం కూడా ఇవ్వలేదని ఆశా కార్యకర్తలు వారి సొంత డబ్బు పెట్టి కొనుగోలు చేస్తున్నారని తక్షణం రికార్డు పుస్తకాలను స్మార్టుఫోను ఆశా కార్యకర్తలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.గత మూడు సంవత్సరాలుగా ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ ఇవ్వలేదని తక్షణం యూనిఫామ్ అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత ఆశాలకు వర్తించదని అధికారులు చెబుతున్నారని అర్హత కలిగిన ఆశా కార్యకర్తలకు వైయస్సార్ చేయూత వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

# నెల్లూరు జిల్లాలో 780 మంది సర్పంచ్ లకు చెక్ పవర్

**సాంకేతిక కారణాలతో 155 మందికి నిలిపివేత**

నెల్లూరు పంచాయతీరాజ్ శాఖ అధికారులు జిల్లాలోని సర్పంచ్లకు చెక్పవర్ ఇచ్చారు. పంచాయితీ పాలకవర్గాలు కొలువుదీరి 4 నెలలైనా, పంచాయతీ అధికారులు పరిపాలన సాగించారు. నెల్లూరు జిల్లాలో 941 పంచాయతీలు ఉన్నాయి. అందులో 780 మంది సర్పంచులకు మాత్రమే ప్రభుత్వం చెక్ పవర్ కట్టబెట్టింది. ఇంకనూ 155 మంది సర్పంచులకు చెక్ పవర్ రావాల్సి ఉంది. ఇప్పటి వరకు సర్పంచులకు ఈ అధికారాలు లేకపోవడంతో, ప్రతి చిన్న పనికి ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయితీ కార్యదర్శుల పై ఆధారపడాల్సి వచ్చింది. సి ఎఫ్ ఎం ఎస్ లో ఐడి లు కేటాయించడం వల్ల ఆయా పంచాయతీలకు సంబంధించిన నిధులను సర్పంచులే డ్రా చేసుకునే అవకాశం ప్రభుత్వం చెక్ పవర్తో కల్పించింది. జిల్లాలో ,941 పంచాయతీలు ఉండగా, వివిధ కారణాలతో జిల్లాలో 4 చోట్ల ఎన్నికలు ఆగిపోయాయి. వీటిలో వెంకటాచలం మండలం లో 2, చేజర్ల మండలంలో 2 పంచాయతీలలో ఎన్నికలు జరగలేదు. నెల్లూరు గ్రామీణ మండలం, పొదలకూరు మండలాలలో ఇప్పటి వరకు ఇద్దరు సర్పంచులు కరోనా వైరస్ పాజిటివ్ తో మరణించారు. దీంతో 935 సర్పంచులకు గాను 780 మంది సర్పంచ్లకు మాత్రమే ప్రభుత్వం చెక్పవర్ ఇచ్చింది. వివిధ సాంకేతిక కారణాలతో 155 మందికి చెక్ పవర్ ఆగింది. వీరందరికీ కూడా త్వరలోనే చెక్పవర్ అధికారాన్ని ఇచ్చేందుకు గాను, జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కోవిడ్ వైరస్ నేపథ్యంలో గ్రామాలలో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని అమలు చేసి, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, సర్పంచులు, పంచాయతీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. కరోనా వైరస్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగానే అవసరమైన ప్రత్యేక నిధులతో పాటు,14,15 ఆర్థిక సంఘం నిధులను ఆయా పంచాయతీల ఖాతాలలో ప్రభుత్వం జమ చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా సర్పంచులకు, స్వయంగా నిధులను డ్రా చేసే అధికారం లేక పోయింది.

# ప్రభుత్వం నుంచి అనుమతులు తప్ప- ఎటువంటి సహకారం లేదు

**ఆనందయ్య కీలక వ్యాఖ్యలు**

నెల్లూరు ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి జిల్లాలో నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో కరోనా ఔషధం పంపిణీ కొనసాగుతుందని ఆనందయ్య స్పష్టం చేశారు .కొన్ని ఆటంకాల వల్ల ఔషధ పంపిణీ సవ్యంగా సాగట్లేదంటూ ఆనందయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పంపిణీకి వనరులు సమకూరడం లేదని, విద్యుత్ సౌకర్యం, ఔషధ తయారీ యంత్ర సామగ్రి లేదని ఆనందయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులే తప్ప, ఇప్పటివరకు ఎటువంటి సహకారం లేదని ఆనందయ్య వ్యాఖ్యానించారు. ప్రభుత్వం సహకరిస్తే అన్ని ప్రాంతాలకు ఔషధాన్ని అందిస్తామంటూ ఆయన వెల్లడించారు.అయితే మందు కోసం ఎవరూ కృష్ణపట్నం రావద్దని నియోజవర్గంలోనే పాజిటీవ్ బాధితుల ఇంటి వద్దకే మందు చేర్చాలని చూస్తున్నామని ఆనందయ్య తెలిపారు. కృష్ణపట్నంలో పూర్తి అయిన తర్వాతే తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలకు మందు పంపిణీ చేస్తామని తెలిపారు. మందు కావలసినవారు అధికారుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని ఆనందయ్య సూచించారు. కోవిడ్ నిబంధనల ప్రకారమే మందు పంపిణీ జరుగుతుందని ఆనందయ్య పేర్కొన్నారు. కాగా ఆనందయ్య కరోనా మందుకు 'ఔషధచక్ర'గా నామకరణం చేశారు.

# ట్రావెల్ రంగాన్నికుదిపేసిన కరోనా



హైదరాబాద్, జూన్ 8, (న్యూస్ పల్స్) కరోనా టూర్స్ అండ్ ట్రావెల్స్ రంగాన్ని కుదిపేసింది. ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలను ఆవిరి చేసింది. కరోనా నేపథ్యంలో లాక్ డౌన్ విధించడంతో ట్రావెల్ అండ్ టూరిజంపై ఆధారపడిన వేలాది మంది ఉపాధి కోల్పోయారు. ట్రావెల్స్ నిర్వహణ ఖర్చులు, కుటుంబ పోషణ భారమై రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. ప్రభుత్వసాయం కోసం ఎదురు చూస్తున్నారు.రాష్ట్రంలో టూర్స్ అండ్ ట్రావెల్స్ రంగంలో 10,000 మంది ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. దాదాపు 10 లక్షలమంది ప్రత్యక్షంగా జీవనోపాధి పొందుతుండగా, మరో 50 లక్షలు పరోక్షంగా ఆధారపడ్డారు. రాష్ట్ర జీడీపీలో 10శాతం పర్యాటక పరిశ్రమది. 2014 వరకు కేవలం 75,000 విదేశీ పర్యాటకులు వచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను సందర్శించేశారు. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పర్యాటకుల సంఖ్య 3.5 కోట్లకు చేరింది. దేశానికి, రాష్ట్రానికి ఆర్థిక విలువలు, అవసరమైన విదేశీ మారకద్రవ్యం అందించడంలోనూ టూర్స్ అండ్ ట్రావెల్స్ రంగం కీలక భూమిక పోషిస్తుంది. కరోనాకు ముందు దేశీయ ప్రయాణికులతో దాదాపు రూ.10 కోట్ల వ్యాపారం జరిగేది. ఇప్పుడు మహమ్మారి కారణంగా అన్నీ మాయమయ్యాయి. పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.ప్రభుత్వం కరోనా నేపథ్యంలో పర్యాటక రంగంపై ఆంక్షలు విధించింది. ఇతర రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని పుణ్యక్షేత్రాలుగానీ, పర్యాటక ప్రాంతాలకు గానీ అనుమతిని రద్దు చేసింది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఉన్న టూర్స్ అండ్ ట్రావెల్స్ కార్యాలయాలను నిర్వహకులు మూసి వేశారు. గతేడాది కరోనా నుంచి మూసి వేయడంతో ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. కనీసం పనిచేసే సిబ్బందికి సైతం వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది.ప్రజలకు ఆనందం, వినోదానికి ట్రావెల్ అండ్ టూరిజం దోహద పడుతుంది. అయితే కరోనా నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో ప్రదేశాలను చూడటాన్ని ప్రభుత్వాలు నిషేధించాయి. అయితే ట్రావెల్స్ ను నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఏజెంట్లు, టూర్ ఆపరేట్లకు గడ్డుకాలం ఏర్పడింది. దాని నుంచి కొంత ఉపశమనం కలగాలంటే రాష్ట్రంలోని పరిసరాల పర్యాటకం, గ్రామీణ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆ దిశగా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం అనుమతిస్తే ట్రావెల్ అండ్ టూరిజం పరిశ్రమ 'మనుగడ'సాగించే అవకాశాలున్నాయి.రాజధానిలో గోల్కొండతో పాటు రాష్ట్రంలో జయశంకర్ భూపాలపల్లిలో జిల్లా లక్నవరం, ములుగు జిల్లాలో బోగాత వంటి అనేక జలపాతాలు, తీర్థయాత్రలు వంటి పర్యాటక ఆకర్షణలు ఉన్నాయి. ఆదిలాబాద్ కోట, కరీంనగర్లో ఎలగందల్ కోట, మహబూబ్ నగర్, కర్నూలు జిల్లాల సరిహద్దులో అంకాళమ్మ కోట, నిజామాబాదు జిల్లా, జుక్కల్లో కౌలస్ కోట, ఖమ్మం కోట, కుసుమంచి గణపేశ్వరాలయం, మహబూబ్ నగర్ జిల్లాలోని గద్వాల కోట, మహబూబ్ నగర్ జిల్లాలోని గిరి దుర్గాలలో ఒకటి ఘనపురం ఖిల్లా, చంద్రఘడ్ కోట, పానగల్ కోట, రాజోల్ కోట, నల్లగొండ జిల్లాలో యాదాద్రి, దేవరకొండ కోట, భువనగిరికోట, కామారెడ్డిలో దొమకొండ కోట, మెదక్ కోట, వరంగల్ లోని వెయ్యి స్తంభాల గుడి, కొమురంభీం జిల్లాలోని జోడేఘాట్ లో సప్తగుండాల జలపాతాలు, మహబూబ్ నగర్ లో సలేశ్వరం జలపాతం, జగిత్యాలలో కొండగట్టు, రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ గ్రామంలో మహేశ్వరాలయం, నిజామాబాద్ జిల్లాలోని జానకంపేట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ప్రముఖ ప్రదేశాలు.తక్షణ సాయంగా ఏజెంట్లకు, ఆపరేట్లకు 2022 మార్చి వరకు నెలకు రూ.5వేలు. రాబోయే 3 ఆర్థిక సంవత్సరాల్లో తిరిగి చెల్లించేలా రూ. 25 లక్షల వరకు వడ్డీ లేని రుణాలివ్వాలి. రూ .25 లక్షలకు పైబడిన మొత్తానికి నామమాత్రపు వడ్డీ వసూలు చేసేలా చూడాలి. కార్యాలయాలకు 2021-2022 వరకు ఆస్తిపన్ను మినహాయింపు. పర్యాటక, ప్రయాణ పరిశ్రమలపై ఆధారపడిన వారికి టీకా వేయాలి. ప్రత్యేకంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కేటాయింపు. అత్యవసర సేవల కింద సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.2లక్షలు వడ్డీలేని రుణం. సిబ్బంది పిల్లలకు పాఠశాలలు, కళాశాలలలో ఫీజు మినహాయింపు. కేరళ, గుజరాత్, మణిపూర్ తరహాలో పర్యాటకాన్ని ప్రోత్సహించాలి. మణిపూర్, ఏపీ ప్రభుత్వాల మాదిరిగా పునరుద్ధరణ ప్యాకేజీలను ప్రకటించాలి.

## ఉద్దానం మామిడికి డిమాండ్



శ్రీకాకుళం, జూన్ 8, (న్యూస్ పల్స్)వాతావరణం సహకరించడంతో ఉద్దానం ప్రాంతంలో మామిడికాయలు విరగకాశాయి. పైగా ఉద్దానం మామిడి రుచిగా ఉంటుండడంతో మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో రైతులు స్థానిక వర్తకులు, దళారీలతో ముందస్తు ఒప్పందం ప్రకారం కాయలను బరంపురం రవాణా చేస్తున్నారు. ఉద్దానంలో పండే కొబ్బరి, మామిడి, పనస వంటి ఉద్యాన పంటలకు ప్రధాన మర్కెట్ ఒడిశా. కొన్ని దశాబ్దాలుగా ఇదే రీతిలో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రస్తుతం లాక్డన్ కారణంగా ఒకపూట మాత్రమే లావాదేవీలకు ఆస్కారం ఉండడంతో వ్యాపారాలు పరిమితంగా సాగుతున్నాయి.ఒడిశా అంబోమార్కెట్కు రోజుకు 150 లోడులు టాటామ్యాక్సీ పికప్ వ్యానులలో ఉద్దానం నుంచి మామిడికాయలు వస్తున్నట్టు వర్తకులు చెబుతున్నారు. కలెక్టర్ రకం టన్ను రూ.8000, దేశవాళీ రకం టన్ను రూ.6000, బంగినపల్లి రకం టన్ను రూ.15,000 ధర పలుకుతోందని అంటున్నారు. రైతులు ఎవరైనా కాయలు కోసి తీసుకువస్తామంటే తామే వాహనం పంపిస్తామని, అన్లోడింగ్ అయినవెంటనే డబ్బులు చెల్లిస్తామని అక్కడి వ్యాపారులు చెబుతున్నారు. ఉద్దానంలో పంట కూడా ఇప్పుడేపక్వానికి వచ్చేదశలో ఉంది. నీలాల రకం ఇప్పటికీ లేత దశలోనే ఉన్నాయి. జగన్నాథ రథయాత్ర సమయానికి కోతకు వస్తాయి. మరో 10 రోజుల్లో అంబామావాస్యా (ఒడిశాలో పేరుగాంచిన పండుగ)కు పనస, మామిడిపళ్లను ఒడిశావాసులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. దీంతో క్రమంగా ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది.ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో పండి కొబ్బరి, మామిడి, పనస పంటలను ఒడిశా ప్రజలే ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ఉద్దానం పంటను ఒడిశావాసులు ఓ బ్రాండ్ ఇమేజ్గా భావిస్తారు. గత కొన్ని తరాలుగా ఇదే సంప్రదాయం కొనసాగుతోంది.

## వెలగలేరు లో ఆగని మట్టి మాఫియా ఆగడాలు

మైలవరం వెలగలేరు లో మట్టి మాఫియా ఆగడాలు ఆగడంలేదు. భలేరావు చెరువు నుంచి వందలాది ట్రక్కుల మట్టి ఇటుక బట్టీలు కి తరలించుకుపోతోంది. అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నాయకులకు చెందిన ఖాళీ ప్రదేశాల్లో వందలాది ట్రక్కుల మట్టి నిల్వవుంటోందని వారు అంటున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్ ను పెట్టి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్న ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదు. గత వారం రోజులుగా వేలాది ట్రక్కుల మట్టి తరలించారని వారు ఆరోపిస్తున్ఆరు. లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్మును తన జేబులో వేసుకుంటున్నారు కొంతమంది నేతలు. ఇంత జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడడంలేదని గ్రామస్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మెరక లకు మట్టి తోలుకోవాలంటే సవాలక్ష నిబంధనలు పెట్టే అధికారులు ఇటుక బట్టీలకు మట్టి తరలి పోతుంటే ఏం చేస్తున్నారు అని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే మట్టి అక్రమ రవాణా అడ్డుకోవాలని వెలగలేరు గ్రామస్తులు కోరుతున్నారు.

## నౌకాదళంలో కొత్త హెలికాప్టర్లు

విశాఖపట్నం తూర్పు నౌకాదళంలో కొత్తగా మూడు అడ్వాన్స్డ్ లైట్ హెలికాప్టర్లు చేరాయి. వైస్ అడ్మిరల్ అజేంద్ర బహుదూర్సింగ్ వీటిని ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన వీటితో తీర ప్రాంత గస్తీ, రక్షణ మరింత మెరుగువు తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక రాడార్, రెస్క్యూకు ఉపయోగపడే ఎలకో?ట్ర ఆప్టికల్ ఎక్వి?పమెంట్, హెవీ మెషిన్గన్ తదితర అత్యాధునిక సౌకర్యాలు ఉన్న ఈ హెలికాప్టర్లు పగలు, రాత్రి అని తేడా లేకుండా అన్ని వాతావర ణాల్లోనూ పనిచేస్తాయి.

## కల్తీపాల కేంద్రంపై దాడులు

చిత్తూరు చిత్తూరు జిల్లా చిన్నగోరంట్లపల్లె లో కల్తీపాలు తయారీ కేద్రం పై దాడులు జరిగాయి. కల్తీపాలు తయారుచేసే వ్యక్తిని పుడ్ సేఫ్టీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పాలు ,నీళ్ళు, యూరియా, సన్ ఫ్లవర్ నూనె తో పాటు జ్యూస్ మిక్సర్లు స్వాధీనం చేసుకున్నారు. .ఈ క్రమంలో నూనె యూరియా సల్ఫర్ అనే అతి ప్రమాదకరమైన పదార్థాలను వినియోగిస్తున్నారని అధికారులు పరీక్షించి నిర్ధారించారు. పక్కా సమాచారంతోనే నిందితుడు సంజీవరెడ్డి ఇంటిపై తనిఖీలు జరిపారు. సంజీవ రెడ్డి పై ఫుడ్ సేఫ్టీ అధికారులు కేసు నమోదు చేసారు. విషయం తెలుసుకున్న కె.వి పల్లి పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## గోనెసంచిలో మృతదేహం

ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లా కామవరపుకోట మండలం ఉప్పలపాడు సమీపంలో గోనెసంచిలో మృతదేహం లభించిది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతుడు కామవరపుకోట మండలం తడికలపూడి కి చెందిన రమేష్ గా పోలీసులు గుర్తించారు. ఇటీవల కరోనా తో మృతి చెందిన కామవరపుకోట గ్రామానికి చెందిన అడ్వకేట్ ప్రకాష్ ఇంటి వద్ద పనిచేస్తున్న రమేష్ ను గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతకంగా గొంతు కోసి హత్య చేసి గోనెసంచిలో మూటకట్టి కామవరపుకోట శివారులో పడేసారు. జంగారెడ్డిగూడెం డిఎస్పి రవికిరణ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు పర్యవేక్షిస్తున్నారు.

## గుంటూరులో జగన్న తోడు పథకం

గుంటూరు గుంటూరు కలెక్టరేట్ లో జరిగిన జగనన్న తోడు పథకం కార్యక్రమంలో హోంశాఖ మంత్రి మేకతోటి సుచరిత పాల్గొన్నారు. తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయం నుండి బటన్ నొక్కి సీఎం జగన్ మోహన్ రెడ్డి తోడు పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల 70 వేల మంది చిరు వ్యాపారులు ఖాతాల్లో 10 వేల రూపాయల చొప్పున 370 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. గుంటూరు కలెక్టరేట్ లో జరిగిన వీడియో కాన్ఫిరెన్సు కు ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాలి గిరి, నంబూరి శంకర్రావు, ఎమ్మెల్సీ జాంగా కృష్ణమూర్తి, మేయర్ కావాటి మనోహర్ నాయుడు, కలెక్టర్, జేసీ, ఇతర నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# పట్టణ భాజపా ఆధ్వర్యంలో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

మందమర్రి జూన్ 08( విభారె) మందమర్రి పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మద్ది శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని 7,14వ వార్డుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం ఇప్పుడిచ్చే 5 కిలోల బియ్యానికి అదనంగా 5 కిలోలు కలిపి మొత్తం ప్రతి ఒక్కరికీ 10 కిలోల బియ్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీపావళి వరకు ఉచితంగా ఇవ్వాలని అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఈ నెల 21వ తారీకునుండి ఉచితంగా వ్యాక్సిన్ ఇవ్వాలని తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ పట్టణంలో ని 7వ వార్డు,14వ వార్డు లలో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేఖం చేసి వారికి ధన్యవాదాలు తెలియజేశామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు మద్దిశంకర్, యువమోర్చా అధ్యక్షుడు,రంగు శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు బియ్యాల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి సేపూరి లక్ష్మణ్, బిసిమోర్చా అధ్యక్షుడు పూసాల ఓదెలు, వి.సదానందం, యువమోర్చా ప్రధాన కార్యదర్శి జంగం మధు,బూత్ అధ్యక్షుడు కాంపెల్లి సుధాకర్,యువమోర్చా నాయకుడు ఓరుగంటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆరవరోజు కూడా కొనసాగిన అన్నదాన కార్యక్రమం

ఎమ్మిగనూరు హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆరవ రోజు కూడా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన హిందు చైతన్య వేదిక సభ్యులు.ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.గ్రామీణ ప్రాంతాల వారికి మరియు వివిధ గ్రామాల నుంచి వైద్యం కోసం వచ్చిన వారికి,గర్భిణీ స్త్రీలకు,రోగులకు,వారి సహాయకులకి ఆహారాన్ని అందించారు.ఈరోజు అన్నదాన కార్యక్రమానికి సహాయం అందించిన దాతలు(వడ్డే ఉరుకుందు, మాల నరసప్ప ) హిందూ చైతన్య వేదిక సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో,హిందు చైతన్య వేదిక సభ్యులు, రవి కుమార్ వడ్డే రాజ్, జటీప్ప, మొదలగు సభ్యులు పాల్గొన్నారు ఇలాంటి అన్నదాన కార్యక్రమానికి ఎవరైనా తమ సహాయ సహకారాలు అందించాలని అని భావిస్తే కింది నెంబర్లు 9160530610, సంప్రదించవలసిదిగా తెలియజేశారు.

## దర్శి లో రైతులు సమస్యలు పై బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

దర్శి రైతాంగ సమస్యలపై మంగళవారం బిజెపి రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్ష లో భాగంగా ప్రకాశం జిల్లా దర్శి బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో రాష్ట్రంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా పాల్గొన్న ఒంగోలు పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు తిండి నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఈ వైసీపీ ప్రభుత్వంలో ధగా పడ్డ రైతులకు న్యాయం చేయాలని, వ్యవసాయాన్ని పరిరక్షించాలని, సకాలంలో పంటలను సేకరించాలని, పంట కొనుగోలు అధికారులు ధళారుల దోపిడీని అరికట్టాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో నగదు చెల్లించాలని, సూక్ష్మ వ్యవసాయాన్ని కొనసాగించాలని, యంత్ర పరికరాలకు సబ్సీడీ ఇవ్వాలని, గత ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు వర్ణం శ్రీనివాసులు, దర్శి నియోజకవర్గ ఇంఛార్జ్ మాడపాకుల శ్రీనివాసులు, జిల్లా ఎస్సి మోర్చ ప్రధాన కార్యదర్శి జ్యేస్టాది ఆంజనేయులు, టౌను అధ్యక్షులు కణితి నాగభూషణాచారి, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరంరెడ్డి నాగిరెడ్డి, శేషం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు

తుగ్గలి తుగ్గలి మండలంలోని ఉపాధి హామీ కూలీలకు అధికారుల సమక్షంలో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.మంగళవారం రోజున జొన్నగిరి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు వైద్య శాఖ ఉద్యోగులు చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో వీరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీలు అందరూ ఒకే చోట ఉండి పనులు నిర్వహించడం వలన వారిలో ఎవరికైనా వైరస్ ఉంటే అందరికీ వచ్చే ప్రమాదం ఉందని,దీంతో గ్రామానికి మొత్తం కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి అన్నారు. అందువల్ల ప్రతి ఒక ఉపాధి కూలీ తప్పనిసరిగా కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.ప్రతి ఒక్కరు కర్ఫ్యూ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని వారు తెలియజేసారు.45 సంవత్సరాలు పైబడిన వారు తప్పకుండా వాక్సిన్ ను తప్పక వేయించుకోవాలని వారు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు,ఏపీఓ రామకృష్ణ ,పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి, విఆర్వో వెంకట రమణా రెడ్డి,హెల్త్ కార్యదర్శి పద్మావతి, వైయస్సార్ క్రాంతి పథకం కోఆర్డినేటర్ రవి కుమార్,ఫీల్డ్ అసిస్టెంట్ సుంకప్ప,ఆశా కార్యకర్తలు,సచివాలయ ఉద్యోగులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

## తూకంలో మోసానికి పాల్పడుతున్న రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలి

కోరుట్ల జూన్ 08 రేషన్ బియ్యం తూకంలో మోసానికి పాల్పడుతున్న పట్టణంలోని కొంతమంది రేషన్ డీలర్లు గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలనికోరుతూ సోషల్ వర్కర్ రమణ మిట్టపెల్లి మంగళవారం స్థానిక తహసీల్దార్ నడిమెట్ల సత్యనారాయణ కి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూతూకంలో మోసానికి పాల్పడుతూ వినియోగదారులకు తక్కువ బియ్యం ఇస్తున్నారని,


పది కిలోల బియ్యానికి సుమారు ఒక కిలో వరకు తక్కువగా తూకం వేస్తూ మోసానికి పాల్పడుతున్నారని, లబ్దిదారులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. తూకం తక్కువ వేసిన బియ్యాన్ని పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెట్ కు తరలించి రేషన్ డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు.కరోనా కష్ట కాలంలో పేద, మధ్య తరగతి వారిని దోచుకోవడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారని ఆయన అన్నారు.రెవెన్యూ మరియు సివిల్ సప్లై అధికారులుక్షేత్ర స్థాయి రేషన్ షాపులను పర్యటించి,విచారణ జరిపి మోసాలకు పాల్పడుతున్న రేషన్ డీలర్లు పై తగు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

# పెరుగుతో తినగూడని పదార్థాలు ఏవి? ఎందుకు?



హైదరాబాద్: మనలో పెరుగంటే ఇష్టం లేనిది ఎవరికి? భోజనం ముగించే ముందు పెరుగన్నం కలుపుకుని తినడం తెలుగిళ్లల్లో సర్వ సాధారణం. కొందరు పెరుగును ఊరికే తింటుంటారు. లేదా లస్సీల రూపంలో, మజ్జిగ రూపంలో తీసుకుంటారు. పెరుగు వల్లకలిగే మేలు తెలిసిందే. పెరుగులో ఉండే ప్రోబయోటిక్స్ మన జీర్ణశక్తిని మెరుగుపర్చి ఉష్ణాన్ని తగ్గిస్తాయి. అందుకే పెరుగు తింటే కడుపు చల్లగా ఉంటుంది అంటారు. పెరుగు మంచిదే అయినా పెరుగుతో కలిపి లేదా పెరుగు తిన్న వెంటనే తినగూడని పదార్థాలు కొన్ని ఉన్నాయి. పెరుగు తిన్న వెంటనే నూనెలో దేవిన లేదా వెన్న, నెయ్యి అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవద్దు. దీనివల్ల జీర్ణక్రియ మందగించి బద్ధకం కలుగుతుంది. పెరుగు, చేపలు కలిపి తినగూడదనేది పెద్దలు చెప్పిన మరో మంచిమాట. దీనికీ కారణం లేకపోలేదు. మాంసకృత్తులు అధికంగా ఉండే రెండు రకాల పదార్థాలు ఒకేసారి తినరాదని ఆయుర్వేదం చెప్తున్నది. పెరుగు, చేప రెండూ అధిక ప్రొటీన్లు కలిగినవే. కలిపి తింటే అజీర్ణంతోపాటు చర్మ సమస్యలు వస్తాయి. ఇక పెరుగు, పాలు కలిపి తీసుకోరాదనేది మరోమాట. రెండింటిలో కొవ్వు అధికంగా ఉంటుంది. ఒకటి పులిసింది, ఒకటి పులియనిది. అంతే తేడా. రెండూ ఏకకాలంలో తీసుకుంటే ఎసిడిటీ, గుండెమంట, విరేచనాలు, కడుపుబ్బరం వంటి వస్తాయి. ఇక చివరగా మామిడి పండుతో పెరిగు తీసుకోవడం. ఇది వినడానికి, తినడానికి బాగుంటుంది. కానీ పెరుగు తిన్న వెంటనే లాద పెరుగుతోపాటే మామిడి తీసుకుంటే శరీరంలో విషపదార్థాలు పెరుగుతాయి. ఫలితంగా ఎలర్జీలు, చర్మ సమస్యలు రావచ్చు.

# కరోనా తర్వాత హృద్రోగ లక్షణాలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు



కరోనా ఇన్ఫెక్షన్ ఊపిరితిత్తుల్లో చేరడంతో ఆయాసం, శ్వాస తీసుకోవడంలో అసౌకర్యం, ఆక్సిజన్ స్థాయి తగ్గడం, చెమట పట్టడం తదితర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.మొదటిది శ్వాసలో ఇబ్బంది. సరిగా ఊపిరి పీల్చుకోలేకపోవడం, ఆయాస పడటం వంటి సమస్యలు ఉన్నవాళ్లలో శరీరంలోని ముఖ్య అవయవాలకు ఆక్సిజన్ సరఫరాలో ఇబ్బంది కలిగే అవకాశం ఉంటుంది. ఈ ప్రభావం గుండెపైనే కాకుండా ఊపిరితిత్తులమీదా పడుతుంది. రెండోది ఛాతి నొప్పి. గుండె భారంగా ఉండటం, ఒక రకమైన అసౌకర్యం, అనవసర ఆందోళన కొందరిలో కనిపిస్తాయి. మరికొందరిలో భరించలేని నొప్పి ఉంటుంది. ఈ నొప్పి చేతులు, మెడ, ఇతర భాగాలకు వ్యాపించే అవకాశం ఉంటుంది.

మొదటి దశకన్నా రెండో దశలోనే మనిషి శరీరంలోని పలు భాగాలపై కరోనా అధిక ప్రభావం చూపుతున్నది. శ్వాసకోశ వ్యవస్థ, ఊపిరితిత్తులపై ముప్పేట దాడి చేయడమేకాక గుండెనూ వదలడం లేదు. కరోనానుంచి కోలుకున్న తర్వాత అనేకమందిలో గుండెజబ్బుల లక్షణాలు కనిపిస్తున్నట్టు తెలుస్తున్నది. ఆయాసం (శ్వాసలో ఇబ్బంది), ఛాతి నొప్పి, ఆక్సిజన్ స్థాయి తగ్గడం, మైకం కమ్ముకోవడం, విపరీతంగా చెమటలు పట్టడం వంటి అయిదు లక్షణాలు ఇటీవల పలువురు రోగుల్లో ప్రధానంగా కనబడుతున్నాయి. చికిత్స సమయంలోనూ, కోలుకున్న తర్వాత కూడా ఈ లక్షణాలు వెంటాడుతున్నట్టు తెలుస్తున్నది. కొవిడ్‌నుంచి కోలుకున్న వారిలో 70 శాతం మంది గుండెజబ్బులకు సంబంధించిన ఏదో ఒక లక్షణంతో ఇబ్బంది పడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.చాలామంది శరీరంలో ఆక్సిజన్ కొరతే గుండె సమస్యలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. కరోనా తీవ్రత కారణంగా స్టెరాయిడ్స్ వాడకం, ఇన్ఫెక్షన్ ప్రభావం వల్లకూడా కొందరు హృద్రోగం బారిన పడుతున్నారు. టెన్షన్, భయం వల్లా కొన్నిసార్లు ఎటువంటి సమస్యలూ లేకుండానే ఆయాసం, ఛాతి నొప్పి వస్తున్నాయి. కరోనా వచ్చాక రక్తం చిక్కగా మారడం వల్లకూడా హార్ట్ ఎటాక్‌కు ఆస్కారం ఏర్పడుతుంది.

## సునీల్? ఛేత్రి కమాల్?.. కిక్?తో మెస్సీ వెనక్కి

రోనాల్డో –మెస్సీ.. ఈ ఇద్దరిలో ఎవరు గొప్ప? అంటూ ఇద్దరి ఫ్యాన్స్? సోషల్ మీడియాలో కుమ్ములాడుకోవడం చూస్తుంటాం. కానీ, ఈ ఇద్దరిలో మధ్యలో గట్టి పోటీ ఇస్తూ ఇప్పుడు ఇంకొకడు వచ్చి దూరాడు. ఆ ఒక్కడు ఎవడో కాదు.. భారత ఫుట్?బాల్? మాంత్రికుడు సునీల్ ఛెత్రి.దోహా: సోమవారం 2022 ఫిఫా వరల్డ్‌కప్, 2023 ఆసియా కప్ క్వాలిఫైయర్స్ టోర్నీలలో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు 2–0 తేడాతో గ్రాండ్ విక్టరీ సాధించింది. ఈ రెండు గోల్స్? కూడా సునీల్? ఛెత్రినే కొట్టాడు. ఈ ఫీట్?తో ప్రపంచంలో అత్యధిక గోల్స్ సాధించిన ఫుట్?బాల్? ఆటగాడిగా(ప్రస్తుతం ఆడుతున్న ఆటగాళ్ల) రెండో స్థానంలో నిలిచాడు ఛెత్రి. ప్రస్తుతం ఈ లిస్ట్?లో క్రిస్టియానో రొనాల్డో మొదటి స్థానంలో ఉండగా(103)గోల్స్?తో, రెండో స్థానంలో మొన్నటిదాకా అర్జెంటీనా స్టార్? లియోనాల్ మెస్సీ(72)గోల్స్?తో ఉన్నాడు. ఇక బంగ్లాతో జరిగిన మ్యాచ్?లో రెండు గోల్స్? సాధించడం ద్వారా మొత్తం 74 గోల్స్?తో ఛెత్రి మెస్సీని వెనక్కి నెట్టి రెండో ప్లేస్?కి చేరాడు. ఇక ఆల్?టైం హయ్యెస్ట్ టాప్? 10 గోలర్స్? లిస్ట్?లో చేరడానికి ఛెత్రి మరొక గోల్(75)?? సాధిస్తే సరిపోతుంది.వరల్డ్? కప్? క్వాలిఫైయర్ మ్యాచుల్లో భారత్?కి ఆరేళ్ల తర్వాత దక్కిన తొలి గెలుపు ఇదే. ఇప్పటికే భారత్ ఫిఫా ఆశలు చల్లారగా.. కేవలం చైనాలో జరగబోయే ఆసియా కప్? అర్హత కోసం భారత్ ఫుట్?బాల్? ఆడుతోంది.

# మహేష్ – ఎన్టీఆర్ – చరణ్.. అమ్మడి సౌత్ డెబ్యూ ఎవరితో ఉంటుందో..?




దివంగత 'అతిలోకసుందరి' శ్రీదేవి కుమార్తె బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ గురించి ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. అమ్మడిని తెలుగు ఇండస్ట్రీకి తీసుకురావడానికి మన నిర్మాతలు చాలా కాలంగా ట్రై చేస్తున్నారు. అయితే ఇంతవరకూ కుదరలేదు. ఈ క్రమంలో ఇప్పుడు మూడో క్రేజీ ప్రాజెక్ట్స్ లలో ఏదొక సినిమాతో జాన్వీ టాలీవుడ్ లాంఛింగ్ ఉంటుందని టాక్ నడుస్తోంది.సూపర్ స్టార్ మహేష్ బాబు – డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ లో హ్యాట్రిక్ మూవీ 'హూఓః28' తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ లో రాధాకృష్ణ నిర్మించే ఈ కమర్షియల్ ఎంటర్టైన్ లో జాన్వీ ని హీరోయిన్ గా తీసుకోవాలని చూస్తున్నారట. ఇప్పటికే త్రివిక్రమ్ దీని గురించి ఆమెతో డిస్కషన్ కూడా చేశారని అంటున్నారు.అలానే యంగ్ టైగర్ ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందే 'ఎఔఖీ31' సినిమాతో జాన్వీ టాలీవుడ్ ఎంట్రీ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు ఇప్పటికే ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టారట. ఈ మేరకు జాన్వీ తండ్రి బోనీ కపూర్ ను సంప్రదించినట్టు టాక్ వినిపిస్తోంది.మరోవైపు రామ్ చరణ్ – శంకర్ కలయికలో రాబోతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'చఖీఅ15' లో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటించే అవకాశాలు లేకపోలేదని ఫిలిం సర్కిల్స్ లో అనుకుంటున్నారు. నిజానికి 'జగదేకవీరుడు అతిలోకసుందరి' సీక్వెల్ చేస్తే చరణ్ కు జోడీగా జాన్విని తీసుకొస్తానని నిర్మాత అశ్వినీ దత్ ఎప్పటి నుంచో చెబుతున్నారు.ఇలా అతిలోకసుందరి కూతురి సౌత్ డెబ్యూ గురించి పలు వార్తలు వస్తున్నాయి. మహేష్ – తారక్ – చరణ్ ముగ్గురిలో ఎవరితో కలసి జాన్వీ కపూర్ టాలీవుడ్ లో అడుగుపెడుతుందో చూడాలి. కాగా 'ధడక్' సినిమాతో తెరంగ్రేటం చేసిన జాన్వీ.. 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్' చిత్రంలో ప్రశంసలు అందుకుంది. ఇటీవల నటించిన 'రూహి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో.. ఇప్పుడు 'దోస్తానా 2' సినిమాపైనే ఆశలు పెట్టుకుంది.

# అందుకే సీక్రెట్ గా పెళ్లి చేసుకున్నా: హీరోయిన్




ప్రభాస్ 'బుజ్జిగాడు' సినిమాతోపాటు పలు తెలుగు చిత్రాల్లో నటించి టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరైన నటి సంజనా గల్రాని. తెలుగులో టాప్ స్టార్ గా రాణించలేకపోయిన ఈ బ్యూటీ.. కన్నడ నాట మాత్రం పాపులర్ హీరోయిన్ గా నిలిచింది. ఈ సమయంలోనే ఆమె డ్రగ్స్ కేసులో ఇరుక్కొని జైలుకు సైతం వెళ్లి వచ్చింది. ఆ తర్వాత పాషా అనే డాక్టర్ ను రహస్యంగా పెళ్లి



చేసుకుంది.గత లాక్ డౌన్ సమయంలోనే పెళ్లి చేసుకున్న సంజనా.. తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. అంతేకాదు.. సీక్రెట్ గా పెళ్లి చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందో కూడా వివరించింది. తమ ఇద్దరికీ పెళ్లి కుదిరిన తర్వాతనే డ్రగ్స్ కేసు బయటకు వచ్చిందని దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు తెలిపింది సంజనా.ఈ కారణంగా తన పెళ్లి విషయాన్ని అందరితో పంచుకోలేకపోయినట్టు తెలిపింది. అయితే.. పెళ్లి తర్వాత గ్రాండ్ గా రిసెప్షన్ అరేంజ్ చేయాలని అనుకున్నప్పటికీ.. లాక్ డౌన్ వల్ల సాధ్యం కాలేదని తెలిపింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ వివరాలు వెల్లడించింది సంజనా.

# ఎన్టీఆర్ కోసం పవర్ ఫుల్ టైటిల్ ని పరిశీలిస్తున్న కొరటాల..!


ప్రస్తుతం 'ఆర్.ఆర్.ఆర్' సినిమాలో నటిస్తున్న యంగ్ టైగర్ ఎన్టీఆర్.. తదుపరి చిత్రం కొరటాల శివ దర్శకత్వంలో చేయనున్న విషయం తెలిసిందే. 'జనతా గ్యారేజ్' వచ్చిన ఐదేళ్ల తర్వాత వీరి కాంబోలో మరో సినిమాకి అధికారిక ప్రకటన రావడంతో ఫ్యాన్స్ ఖుషీ అయ్యారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో యువసుధ ఆర్ట్స్ బ్యానర్ పై మిక్కిలినేని సుధాకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా తెరకెక్కనుంది.అయితే కొరటాల శివ 'ఔఖీ30' చిత్రానికి "సెన్సేషనల్" అనే టైటిల్ ని పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో నిజమెంతో తెలియదు కానీ టైటిల్ మాత్రం పవర్ ఫుల్ గా ఉంది. శక్తివంతమైన పాత్రలు పోషించే తారక్ కు తగినట్లుగానే ఉంటుందని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. మరి చివరకు ఎలాంటి టైటిల్ ని ఖరారు చేస్తారో చూడాలి. ఇకపోతే స్టూడెంట్ పొలిటిక్స్ బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది.ప్రస్తుతం ఎన్టీఆర్ – కొరటాల కలిసి డిస్కష్ చేసుకున్న ఓ పాయింట్ ని స్క్రిప్ట్ గా మలిచే పనిలో ఉన్నారు. సామాజిక అంశాలకు తనదైన శైలిలో కమర్షియల్ హంగులు జోడించి బ్లాక్ బస్టర్స్ అందిస్తున్న డైరెక్టర్ కొరటాల శివ.. ఈసారి ఎలాంటి కథను రెడీ



చేస్తారో చూడాలి. ఏదేమైనా తారక్ కెరీర్ లో వస్తున్న ఈ 30వ చిత్రం పై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. 'ఆర్.ఆర్.ఆర్' షూటింగ్ పూర్తయిన తర్వాత ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనుంది. దీని తర్వాత 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ తో ఎన్టీఆర్ ఓ పాన్ ఇండియా మూవీ చేయనున్నారు.

# మీ అంకితభావానికి నా ధన్యవాదాలు: రామ్ చరణ్

కరోనా విపత్కర పరిస్థితుల్లో మెగాస్టార్ చిరంజీవితో పాటుగా తనయుడు రామ్ చరణ్ – కోడలు ఉపాసన తమ వంతు సహాయం చేస్తూ వస్తున్నారు. ఎప్పటికప్పుడు అభిమానులకు ప్రజలకు సందేశాలు ఇవ్వడమే కాకుండా.. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి సేవా భావాన్ని చాటుకుంటున్నారు. ఎందరికో ఆర్థిక సాయం చేసి వారి జీవితాలను భరోసా కల్పించారు. ఇప్పటికే ఉన్న బ్లడ్ బ్యాంక్ – ఐ బ్యాంక్ లకు తోడుగా కొత్తగా ఆక్సిజన్ బ్యాంకులు అనే బృహత్కర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారు. చిరంజీవి – చరణ్ లను ఆదర్శంగా తీసుకున్న మెగా అభిమానులు కూడా తమ బాధ్యతగా పలు ఛారిటీ కార్యక్రమాలు చేశారు. వైరస్ విజృంభిస్తున్న సమయంలో ప్రజలకు సేవలు చేసిన ఫ్రంట్ లైన్ వారియర్స్ ను సత్కరించారు. ఈ నేపథ్యంలో మెగా అభిమానులను రామ్ చరణ్ అభినందించారు.కోవిడ్–19 పాండమిక్ సమయంలో బాధలో ఉన్నవారికి అండగా నిలవడానికి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను చేపట్టినందుకు ఫ్యాన్స్ కి అభినందనలు తెలుపుతూ చరణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. "అభిమానులు ఈ కోవిడ్–19 మహమ్మారి సమయంలో కష్టపడి చేస్తున్న ఈ సమాజ సేవ గురించి నేను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నాను. అత్యవసర పరిస్థితిలో ఉన్న సామాన్యుడికి సహాయం చేయటం నుండి ఎన్నో



సేవా కార్యక్రమాల్లో పాల్గొనటం వరకు మీరు ఎంతో అంకితభావంతో పని చేసారు. ఎన్నో వ్యయప్రయాసలు కూర్చి ఎందరికో సహాయం చేసిన మీ అందరికీ పేరు పేరున నా శుభాభినందనలు. మీ అందరి అంకితభావానికి నా ధన్యవాదాలు" అని రామ్ చరణ్ పేర్కొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190